ప్రజాశక్తి
శుక్రవారం 21 జూన్ 2024
16 పేజీలు
తిరుపతి

శ్రీవారి సేవలో మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి - తిరుమల

మోదీ, పవన్ కళ్యాణ్ నేతత్వంలో చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని యాగం చేశామని...యాగం సంపూర్ణం కావడంతో శ్రీవారికి మొక్కులు చెల్లించుకున్నామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గురువారం ఉదయం విఐపి దర్శన సమయంలో ఆయన శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లను చేశారు. కొల్లు రవీంద్రను చంద్రగిరి ఎంఎల్ఎ పులివర్తి నాని కలిసి దుశ్శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

రుతుపవనాల సన్నద్ధతపై టీటీడీ సమీక్ష

ప్రజాశక్తి - తిరుమల

టీటీడీ ఈవో జె.శ్యామలరావు గురువారం సాయంత్రం రాబోవు వర్షాకాల సన్నద్ధతపై ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో ఈ సమీక్ష జరిగింది. ఇందులో భాగంగా 1996, 2004, 2005, 2015, ఇటీవల 2021 సంవత్సరాల్లో కురిసిన భారీ వర్షాలకు బండరాళ్లు కూలి దెబ్బతిన్న రెండో ఘాట్ రోడ్డును ఎలా పునరుద్ధరించారో అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈవోకు వివరించారు. అనంతరం తిరుపతిలోని కళ్యాణి డ్యాంతో పాటు, తిరుమలలో భక్తులకు ప్రధాన నీటి వనరులైన ఐదు డ్యాముల గురించి ఆయనకు వివరించారు. భవిష్యత్తులో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్లాన్ రూపొందించాలని ఇంజినీరింగ్ అధికారులను ఈఓ ఆదేశించారు. అనంతరం కొనుగోళ్లు, గిడ్డంగుల శాఖలపై కూడా ఈఓ సమీక్షించారు. సమీక్షా సమావేశాల్లో జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సిఇ నాగేశ్వరరావు, ఎస్‌ఈ2 జగదీశ్వర్‌రెడ్డి, ఈఈలు సురేంద్రనాథ్‌రెడ్డి, శ్రీహరి, డీఈ ఎలక్ట్రికల్ రవిశంకర్‌రెడ్డి, జిఎం మురళీకృష్ణ, వేర్హౌజ్ డిప్యూటీ ఈవో పద్మావతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తిరుపతి పీఎస్ 4 హోటల్లో 'జెర్రి'

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి పిఎస్ 4 హోటల్లో భోజనం చేసిన వారికి భోజనం ప్లేటులో జెర్రి కనిపించడంతో అవాక్కయ్యారు. పుత్తూరు నుండి తిరుపతిలో ఒక హాస్పిటల్ కి వచ్చి భోజనం కోసం హోటల్‌కు వెళ్లిన వాసు అతని స్నేహితులు భోజనం ప్లేటులో కూరలో జెర్రి కనిపించడంతో ఇబ్బంది పడ్డారు. ప్రశ్నించినందుకు హోటల్ సిబ్బంది దౌర్జన్యం చేయడంతో వాసు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అధికారులకు ఫిర్యాదు చేశారు. హెల్త్ డిపార్టుమెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కూరగాయలతో పాటు, వంటల్లో నాణ్యతా లోపాలను గుర్తించారు. పిఎస్ 4 కిచెన్‌ను సీజ్ చేశారు.

మహిళా వర్సిటీలో జాతీయ సదస్సు ప్రారంభం

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ విభాగం, ఇన్‌స్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో గురువారం ఆక్సిలరేటర్ ఇంక్యుబేషన్ ఆపర్చునిటీస్ ఎర్లీ స్టేజ్ ఎంటర్‌ప్రెన్యూర్స్ అను అంశం మీద జాతీయ సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి. భారతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ విద్యార్థులు తమ విద్యను ముగించిన తరువాత ప్రధానమంత్రి పిలుపుమేరకు జాబ్ ప్రొవైడర్స్ గా తయారు కావాలని, జాబ్ సీకర్స్‌గా ఉండకూడదన్నారు. ప్రధానమంత్రి నిధులతో చాలా విశ్వవిద్యాలయములలో, కళాశాలలో ఇంక్యుబేషన్ సెంటర్స్ ఏర్పాటయ్యాయన్నారు. విద్యార్థులు ఇంక్యుబేషన్ సెంటర్ వసతులను ఉపయోగించుకొని ఇంక్యుబేటీస్ గా తయారవ్వాలని వారి ఆలోచనలను ఇంక్యుబేషన్ సెంటర్లో విసదీకరించి చెప్పడం ద్వారా వారికి తగిన డబ్బు ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. దీని ద్వారా సమాజంలో వాళ్లు టెక్నాలజీని ముందుకు తీసుకుని వెళ్ళగలరని చెప్పారు. చదువు పూర్తి చేసుకుని వెళ్లిన వారిలో 10శాతం విద్యార్థులు ఆయన ఇంట్రెప్రెనేర్ గా అవ్వాలని, మిగిలిన వారికి ఉద్యోగ అవకాశాలను కల్పించేలా ఉండాలన్నారు. ఈ కార్యక్రమానికి వేలూరు యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీస్ నుంచి డిపార్ట్మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్ ఎం. రాజశేఖర్ బాబు, ఆచార్య పి. వెంకటకృష్ణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కన్వీనర్ గా ప్రొఫెసర్ ఎం. ఉషారాణి, కే. చందన పాల్గొన్నారు.

ఎంఎల్ఎ ఆరణి గెలుపుకు....

శ్రేణులన్నీ కలసికట్టుగా..!

'నామినేటెడ్'లోనైనా కష్టానికి ఫలితం దక్కేనా..?

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గెలుపుకు టిడిపి శ్రేణులు కలసికట్టుగా కృషి చేశాయి. ఓ యుద్ధంలో సైనికుల్లా కార్యకర్తలు పని చేశారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ రెడ్డిని ఓడించడమే ధ్యేయంగా, ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులును గెలిపించడమే లక్ష్యంగా అందరూ పనిచేయడం వల్లనే 62,000 మెజార్టీ లభించింది. తొలుత ఆరణి శ్రీనివాసులు స్థానికుడు కాదని వైసిపి నేతలు ప్రచారం చేసినా తిరుపతి ప్రజలు ఆదరించారు. వైసీపీ ఎన్ని కుట్రలు చేసినా ఇటు టిడిపి అటు జనసేన పార్టీలకు చెందినవారు ఐక్యమత్యంతో పనిచేసి తిరుపతిలో తొలిసారి జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసన్ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ పోత్తులో భాగంగా ఎమ్మెల్యే అభ్యర్థి టికెట్ రాకపోయినా టిడిపి అధిష్ఠానం ఆదేశాల మేరకు గెలుపు కోసం పనిచేశారు. అన్ని డివిజన్లో టిడిపి పార్టీ శ్రేణులను కలుపుకొని ఇటు జనసేన నేతలతో సమన్వయం చేశారు. ఎన్నికల ప్రచారంలో జనసేన ఎమ్మెల్యే అభ్యర్థికి, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థుల ఆలోచనల మధ్య కొంత స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకున్నప్పటికీ తిరుపతి ప్రజలు తీర్పు స్పష్టంగా కనిపించింది. గత ఐదేళ్ల వైసిపి పాలనలో విసిగిపోయిన ప్రజలు ఈసారి జనసేన పార్టీకి పట్టం కట్టారు. నియోజవర్గంలో సుగుణమ్మ ప్రతిరోజూ ప్రచారంలో దూకుడుగా వ్యవహరించడంతో జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపుకు సునాయసం అయ్యింది. దీనికి తోడు టిడిపి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మోహన్ ,35వ డివిజన్ కార్పొరేటర్ ఆర్సి మునికృష్ణ, టౌన్ బ్యాంక్ మాజీ అధ్యక్షులు పులిగోరు మురళీకృష్ణారెడ్డి, టిడిపి నాయకులు జెబి శ్రీనివాసులు, మబ్బు దేవ నారాయణ రెడ్డి, ఊక విజయ్ కుమార్, టిడిపి నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చిన్నబాబు ,మహేష్ యాదవ్, టౌన్ బ్యాంకు మాజీ డైరెక్టర్ మహబూబ్‌బాషా, టిడిపి మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ ,కృష్ణ యాదవ్ తో పాటు టిడిపి మహిళా నాయకురాలు ఎ.సింధుజ, టిడిపి జిల్లా మహిళా మాజీ అధ్యక్షురాలు పుష్పావతి, కుమారమ్మ ,బ్యాంక్ శాంతమ్మ తో పాటు 50 డివిజన్లో ఉన్న టిడిపి అధ్యక్షులు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గెలుపు కోసం సైనికుల్లా పనిచేశారు. అటు జనసేన పార్టీ నుంచి ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ హరిప్రసాద్ కిరణ్ రాయల్, సుభాషిని, సినీ నిర్మాత ఎన్వి ప్రసాద్ ఆరణి శ్రీనివాసులు గెలుపు కోసం విశేషంగా కష్టి చేశారు. తిరుపతిలో జనసేన జెండాను ఎగరవేసేందుకు కూటమి పార్టీ నేతలు అహర్నిశలు పనిచేశారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నేతలకు నామినేటెడ్ పదవులు ఇప్పించడానికి ఆరణి శ్రీనివాసులు తన వంతు కషి చేయాలని కూటమి నేతలు అంటున్నారు. 2009లో చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ తరఫున పోటీ చేస్తే తిరుపతి ప్రజలు ఆదరించారని, 2024 జనసేన పార్టీ నుంచి తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను గెలిపించడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గతంలో ప్రకటించిన విషయం తెలిసిందే. తిరుపతి నగరాభివృద్ధికి తన వంతు కషి చేస్తానని ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు ప్రకటించి, ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. తిరుపతి అభివృద్ధి చరిత్రలో నిలిచేలా పనులు చేస్తానని ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు పేర్కొన్నారు.

సుగుణమ్మ, నరసింహయాదవ్, పులిగోరు మురళీకృష్ణారెడ్డి, శ్రీధర్ వర్మ

దీర్ఘకాలిక సమస్యలపై అసెంబ్లీలో చర్చించండి

తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తిరుపతిలో ఉన్న దీర్ఘకాలిక సమస్యలను అసెంబ్లీలో చర్చించాలని నగరవాసులు కోరుతున్నారు. ఈనెల 21 నుంచి 4 రోజులు పాటు అసెంబ్లీ సమావేశాల్లో శెట్టిపల్లి భూ సమస్యను తక్షణమే చర్చించి పేద రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. దీనికి తోడు తిరుపతి నగరంలో పలు డివిజన్లలో 22ఎ అడ్డంకి వల్ల భూములు అమ్ముకోవడం వీలు లేని విధంగా చేయడంతో ప్రజల ఇబ్బందులు వర్ణనాతీతం. తిరుపతి నగరంలో ఉన్న 22 ఏను వెంటనే రద్దు చేసే విధంగా అసెంబ్లీలో ప్రస్తావించాల్సి ఉంది. తిరుపతి స్మార్ట్ సిటీ పథకంలో రాష్ట్రం నుంచి రావాల్సిన 450 కోట్ల రూపాయలు తక్షణమే విడుదల అయ్యే విధంగా అసెంబ్లీలో ప్రస్తావించాలని ఎమ్మెల్యేను నగరవాసులు కోరుతున్నారు. నగరంలో గంజాయి అరికట్టేలా చర్చ జరగాల్సి ఉంది. ట్రాఫిక్ నివారణపైనా చర్చ జరగాల్సి ఉంది. హథీరాంజీ మఠం భూములు ఆక్రమణకు గురికాకుండా పరిరక్షించాల్సిన బాధ్యత ఎంఎల్ఎపై ఉంది.

నానీగారూ...నెరవేర్చండి..!

ప్రజాశక్తి- రామచంద్రపురం

మూడు దశాబ్దాల అనంతరం సార్వత్రిక ఎన్నికలలో చంద్రగిరి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేగా పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) విజయ దుందుభి మోగించారు. గత ఏడు సంవత్సరాలుగా చంద్రగిరి నియోజకవర్గంలో పర్యటిస్తూ ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటాలు చేశారు. గత 10 ఏళ్లలో వైసీపీ (ప్రజాప్రతినిధి) మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అభివృద్ధిని విస్మరించి, చంద్రగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో 30 ఏళ్లు వెనక్కి నెట్టారని ప్రతిపక్ష నాయకుడిగా విమర్శలు గుప్పించారు. ప్రస్తుతం టిడిపి అధికారంలోకి రావడంతో నియోజకవర్గ సమస్యలపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

- అనుప్పల్లి పంచాయతీలో 2017లో 200 మంది రైతులకు సంబంధించిన 300 ఎకరాలు రద్దయిన డికెటి భూములను తిరిగి రైతులకు ఇవ్వాలి.
- రాయలచెరువు అభివృద్ధి.
- నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు పరిశ్రమల ఏర్పాటు.
- అనుప్పల్లి గ్రామంలో ఆరోగ్య కేంద్రం ఏర్పాటుపై.
- రోడ్లు, తాగునీరు, వీధిలైట్లు, ఆర్టీసీ బస్సు సౌకర్యం, పాఠశాలల అభివృద్ధి.
- తలకోన వర్షపునీటిని వృధా చేయకుండా చెరువులతో అనుసంధానం.
- ప్రత్యేక నిధులతో తలకోన అభివృద్ధి.
- మామిడి రైతుల కోసం మామిడి పరిశ్రమ ఏర్పాటు, గిట్టుబాటు ధర కల్పన
- స్వర్ణముఖి నది అభివృద్ధికి ప్రత్యేక దృష్టి
- కళ్యాణిడ్యాం పైప్‌లైన్ ద్వారా తాగునీటిని చంద్రగిరి ప్రజలకు అందించాలి.
- చంద్రగిరిలో అన్నాక్యాంటీన్ ఏర్పాటు చేయాలి.
- స్వర్ణముఖి నదిపై కూలిన వంతెన నిర్మించాలి (చిగురువాడలో)
- తుమ్మలకుంటలో సాగునీటి చెరువు దురాక్రమణ
- తుమ్మలగుంట, ఉప్పరపల్లి, అవిలాల, ఓటేరుల్లో హథీరాంజీ మఠం భూములను కాపాడాలి.
- ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను పరిరక్షించాలి.
- టమోటా రైతుల కోసం చిన్నగొట్టిగల్లు మండలంలో కోల్డ్‌స్టోరేజి ఏర్పాటు చేయాలి.
- చంద్రగిరిలో వందపడకల ఆస్పత్రి ఏర్పాటు
- సి.రామాపురం డంపింగ్‌యార్డులో చెత్తతో విద్యుత్ ప్లాంట్, ఎరువుల తయారీ.

అనుమతులు మీరి...మిద్దెల నిర్మాణం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

వంకాయనిప్పటి ఎల్ కాలంలో ప్రైవేట్ వ్యక్తులు తమ స్థలాల్లో, గ్రామపంచాయతీలలో భవనాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను ఎప్పుడో ఏర్పాటు చేసింది. కానీ కొందరు అతిక్రమించి రాజకీయ అండదండలతో అనుమతులకు మించి మిద్దెల నిర్మాణాలు చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఈ తంతు అంతా ఎక్కడ అనుకుంటున్నారా మంగళం పరిధిలోని సప్తగిరి కాలనీ గ్రామపంచాయతీకి, రణధరపురం గ్రామపంచాయతీకి మధ్య ఉన్న ప్రధాన మార్గంలో జరుగుతోంది. ప్రధాన మార్గంలో ఇంత పెద్ద పెద్ద భవన నిర్మాణం జరుగుతున్న అధికారులు చూసి చూడనట్లు వెనుక రాజకీయ హస్తం ఉందని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు. గ్రామ పంచాయతీల పరిధిలో జి ప్లస్ 2 వరకే అనుమతులు ఉన్న ఐదు అంతస్తులకు పైబడి ఎలా భవన నిర్మాణం పనులు కొనసాగిస్తున్నారో నిమ్మ కుండిపోయిన అధికార గణానికే తెలియాలి. పంచాయతీ ఆదాయానికి గండి పడుతోంది అని తెలిసినా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం పలు విమర్శలకు తావిస్తోంది.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం.....: - విజయ భాస్కర్, పంచాయతీ కార్యదర్శి సప్తగిరికాలనీ గ్రామపంచాయతీ.

సప్తగిరి కాలనీ గ్రామపంచాయతీలో జరుగుతున్న అనుమతుల అతిక్రమణ భవన నిర్మాణాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటాం. పంచాయతీ పరిధిలో డీకేటీ భూమిలో జి ప్లస్ 2 వరకే భవన నిర్మాణం చేసుకోవాలని అనుమతులు ఉన్నాయి. రికార్డులను పరిశీలించి తప్పిదం గుర్తిస్తే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలకు ఉపక్రమిస్తాం.

నేడే ప్రమాణం..

'సూపర్ సిక్స్', వరాల అమలుకు శ్రీకారం



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తెలుగుదేశం పార్టీ స్థాపించి 42 సంవత్సరాలయ్యింది. 1983 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు ప్రపంచవ్యాప్తంగా తెలుగుజాతిని ఇనుమడింపజేస్తూ పార్టీ పెట్టిన తొమ్మిది నెలల్లోనే బంపర్ మెజార్టీతో అధికారం చేపట్టారు. 1983, 1994 ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా జరిగిన ఎన్నికల్లో టిడిపి విజయదుందుభి మోగించింది. ఉమ్మడి జిల్లాలో 1983లో 14 అసెంబ్లీ స్థానాలకు క్లీన్‌స్వీప్ చేసింది. తిరిగి 1994 ఎన్నికల్లో ఒక్క చిత్తూరులో కాంగ్రెస్ అభ్యర్థి సికెబాబు మినహాయించి మిగిలిన 13 స్థానాల్లో టిడిపి విజయకేతనం ఎగురవేసింది. రాష్ట్రంలో అధికారం చేపట్టింది. తిరిగి 2024లో పుంగనూరు మినహా అన్నిచోట్ల టిడిపి విజయదుందుభి మోగించి అధికారాన్ని కైవసం చేసుకుంది. నగరి, జీడీనెల్లూరు, చిత్తూరు, పూతలపట్టు, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేటల్లో టిడిపి నుంచి కొత్తవారు ఎంఎల్ఎలుగా గెలుపొంది అసెంబ్లీలోకి అడుగు పెట్టనున్నారు. మొత్తం 12మంది టిడిపి, ఒకరు జనసేన ఎంఎల్‌లు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అసెంబ్లీలో చర్చ అనంతరం మొదటగా సూపర్‌సిక్స్ అమలుకు ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం సిద్ధం కానుంది.

'... అను నేను.. శాసనసభ్యునిగా...' గెలుపొందినవారు ప్రమాణస్వీకారం చేయనున్నారు. చిత్తూరు జిల్లా కుప్పం నుంచి నారా చంద్రబాబునాయుడు ఎనిమిదోసారి ఎన్నికై, నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. పలమనేరు ఎంఎల్ఎ అమరనాథరెడ్డి నాలుగోసారి ఎంఎల్ఎగా గెలిచారు. పూతలపట్టు నుంచి డాక్టర్ కలికిరి మురళీమోహన్, జీడీనెల్లూరులో డాక్టర్ థామస్, నగరి నుంచి గాలి భానుప్రకాష్ చిత్తూరు జిల్లా నుంచి ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

తిరుపతి జిల్లాలో చంద్రగిరి నుంచి పులివర్తి నాని, శ్రీకాళహస్తి నుంచి బొజ్జల సుధీర్‌రెడ్డి, సత్యవేడు నుంచి ఆదిమూలం, సూళ్లూరుపేట నుంచి నెలవల విజయశ్రీ, వెంకటగిరి కురుగొండ్ల రామకృష్ణ, గూడూరు నుంచి పాశం సునీల్‌కుమార్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఎన్డీఎ కూటమిలో భాగంగా తిరుపతి ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు వీరితో పాటు ఈ మహోత్సవంలో భాగస్వామ్యం కానున్నారు. చిత్తూరు జిల్లాలో ముఖ్యమంత్రి స్థానంలో కుప్పం నియోజకవర్గ ఎంఎల్ఎ చంద్రబాబు మాత్రమే ఉన్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో మరెవరికీ చోటు లేకపోవడం పార్టీ శ్రేణులను నిరాశ పరచింది.

ఎన్నికల వరాల అమలు దిశగా...

ఎన్డీఏ కూటమి సూపర్‌సిక్స్ పథకాలను త్వరలోనే అమలు చేయనుంది. అలాగే జిల్లాలో కుప్పం, పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాలకు హంద్రీనీవా జలాలు రావాల్సి ఉంది. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తూతూమంత్రంగా తెప్పించడాన్ని అప్పట్లో టిడిపి దుమ్మెత్తి పోసింది. తాము అధికారంలోకి వస్తే ఏడాదిలో కృష్ణా జలాలే కాకుండా, గోదావరి జలాలను జిల్లాకు తెస్తానని చంద్రబాబు హామీ ఇచ్చి ఉన్నారు. కుప్పంలో రైతులు పండించే కూరగాయలు, పండ్లును విదేశాలకు ఎగుమతి చేసేలా విమానాశ్రయాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. దీంతో పాటు కుప్పం నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రత్యేక మ్యానిఫెస్టో తీసుకొచ్చారు. ఒకడుగు ముందుకేసి నారా చంద్రబాబునాయుడు సతీమణి ఏ బూత్‌ను అత్యధిక మెజార్టీ తీసుకొస్తారో, ఆ బూత్‌ను తాను దత్తత తీసుకుంటానని చెప్పారు. చెన్నయ్‌కి, బెంగుళూరుకు కుప్పం దగ్గరగా ఉండడంతో యువత ఉపాధికి పరిశ్రమలు తీసుకొస్తామని చెప్పారు. పుంగనూరు, గూడూరులను పాలనా సౌలభ్యం కోసం అన్నమయ్య జిల్లాలోనూ, నెల్లూరు జిల్లాలోనూ కలుపుతామని చెప్పారు. చిత్తూరులో యూనివర్సిటీ తీసుకొస్తానని హామీ ఇచ్చారు. ఎన్టీఆర్ జలాశయాలను మరింత అభివృద్ధి చేసి తాగునీటి శాశ్వత పరిష్కారానికి హామీ ఇచ్చారు. జీడీనెల్లూరు నియోజకవర్గం వెదురుకుప్పంను తిరుపతి జిల్లాలో కలుపుతామని భరోసా ఇచ్చారు. చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు, నగరి నియోజకవర్గాలకు తాగునీరు, సాగునీరు తెలుగుగంగ, గాలేరు-నగరిని రెండేళ్లలో పూర్తి చేసి రైతుల కళ్లలో ఆనందం చూస్తానన్నారు. నగరిలో విద్యుత్ ఛార్జీలు పెనుభారం కావడంతో 300 యూనిట్లకు మరమగ్గం కార్మికులకు ఉచిత విద్యుత్ ఇస్తానని చెప్పారు. తిరుమల తిరుపతి దేవస్థానాన్ని ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దుతామన్నారు. తిరుపతి అభివృద్ధికి టిటిడి భాగస్వామ్యంతో నిధులు ఖర్చు చేస్తామన్నారు.

'నీట్'ను రద్దు చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - క్యాంపస్

తాజాగా జరిగిన 'నీట్' పరీక్షను రద్దు చేసి, వైద్య విద్యను కాపాడాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎంఆర్‌పల్లి సర్కిల్ వద్ద 'నీట్' అవకతవకలపై గురువారం పెద్దఎత్తున విద్యార్థులు నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి, అధ్యక్షులు అక్బర్ మాట్లాడుతూ ఎన్డీఎ ప్రభుత్వం రోజురోజుకూ అవినీతికి పాల్పడుతోందని, లక్షల మంది విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం ఆడుతోందని, నీట్‌ను రద్దు చేయాలని ఎన్డీఎను బహిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా తిరుపతిలోనూ నిరసన తెలిపినట్లు చెప్పారు. పారదర్శకంగా జరపాల్సిన నీట్ పరీక్షను లక్షలాది రూపాయలు ముడుపులకు కక్కుర్తిపడి విద్యార్థుల భవిష్యత్‌తో ఎన్డీయే ప్రభుత్వం ఆటలాడుతోందన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి మౌనం ఈ అరాచకాన్ని ఆపలేని చేతగానితనం కనిపిస్తోందన్నారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదన్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్‌ను రద్దు చేసి రాష్ట్రాల ఆధ్వర్యంలోనే ప్రవేశ పరీక్షలు నిర్వహించి సమాఖ్య స్ఫూర్తిని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రమేష్‌నాయక్, నాగేంద్ర, మౌనిక, భార్గవ్, శివ, బాల, సునీల్, సాయి పాల్గొన్నారు.

లీక్‌చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి : ఎఐఎస్ఎఫ్

యుజిసి నెట్, నీట్ ప్రశ్నాపత్రాలను లీక్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయంలో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి, నాయకులు చిన్న మాట్లాడుతూ దేశ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహిస్తున్న నీట్ పరీక్ష లీకేజి అవడంపై మండిపడ్డారు. యుద్ధాలను ఆపుతున్నామని చెబుతున్న మోడీ, పరీక్షల లీకేజీలను ఎందుకు ఆపడం లేదని ప్రశ్నించారు. సాయి, ఉదయ్, నవీన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై 'రెవెన్యూ' స్పందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

సంతృప్తి స్థాయిలో ప్రజా సమస్యలపై రెవెన్యూ సిబ్బంది పరిష్కారం చూపాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ దినోత్సవం జరిగింది. కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. గ్రీవెన్స్, భూములు తదితర సమస్యలకు సంబంధించిన సేవలపై బాధ్యతగా ఉండాలన్నారు. ఏ స్థాయిలో ఎలా చేయాలనే విషయాలపై క్షుణ్ణంగా అవగాహన ఉండాలన్నారు. రెవెన్యూ శాఖ విపత్తు, ప్రకతి వైపరీత్యాల వంటి సమయాలలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని సమర్థవంతంగా పని చేస్తుందన్నారు. కంప్యూటర్ పైన నైపుణ్యం కలిగి ఉండాలని తెలిపారు. జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ కంప్యూటర్ పైన నైపుణ్యం పొందడం వలన వారి పనితనం పెంచుకోవచ్చు అన్నారు. రెవెన్యూ సిబ్బంది ఇంకా బాగా పని చేసి శాఖకు మంచిపేరు తీసుకురావాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ రెవెన్యూశాఖలో ఉత్తమ సేవలందించి పదవీ విరమణ చేసిన ఉద్యోగులను శాలువాతో ఘనంగా సత్కరించి, మోమెంటో లు అందజేశారు. డి ఆర్ ఓ మాట్లాడుతూ.. ప్రజలకు అందించే సేవల రివ్యూల కోసం రెవెన్యూ దినోత్సవం కార్యక్రమాలను క్రమ తప్పకుండా జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మురళీ, ఏ.పి రెవెన్యూ అసోసియేషన్ సెక్రటరీ గోపీనాథ్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో గంగయ్య పాల్గొన్నారు.



రెవెన్యూ సిబ్బందిని అభినందిస్తున్న ప్రవీణ్‌కుమార్

తడిపొడి చెత్త వేర్వేరుగా సేకరించండి : కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

నగరంలో ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని, సకాలంలో వాహనాలు చెత్త సేకరణకు వెళ్ళాలని నగరపాలక సంస్థ కమిషనర్ అదితి సింగ్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం తెల్లవారుజాము నుండి నగరంలో ఎయిర్ బైపాస్ రోడ్డు, ఎస్.జి.ఎస్. కాలేజీ రోడ్డు, ఆటోనగర్, చింతలచేను, ఉపాధ్యాయ నగర్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. మీ ఇంటికి ప్రతి రోజూ చెత్త సేకరణకు వాహనం వస్తోందా, దుకాణాల వద్ద, ఇండ్ల వద్ద చెత్త కుండీలు ఉంచారా? అని పరిశీలించి, స్థానికులతో మాట్లాడి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. నగరంలో ఎక్కడా వర్షపు నీరు, మురుగునీరు ఆగకుండా ఇంజినీరింగ్, పారిశుద్ధ్య సిబ్బంది ఒక అవగాహనతో పనిచేసి ఎక్కడా కాలువల్లో చెత్త నిలవకుండా శుభ్రం చేయాలని అన్నారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ , శానిటరీ సూపర్ వైజర్స్ చెంచయ్య, సుమతీ ఉన్నారు.

శ్రీవారి మెట్టు వైపు టోకెన్లు ఉంటేనే దర్శనం

ప్రజాశక్తి రామచంద్రపురం (చంద్రగిరి)

శ్రీవారి మెట్టు మార్గంలో 1200వ మెట్టు వద్ద దివ్య దర్శనం టోకెన్ స్కానింగ్‌ను టీటీడీ పున్నప్రారంభించింది. ఇందుకు సంబంధించిన ట్రయల్ రన్ గురువారం నిర్వహించారు. శ్రీవారి మెట్టు వద్ద దివ్య దర్శనం టోకెన్లు తీసుకున్న భక్తులు శుక్రవారం నుండి విధిగా 1200వ మెట్టు వద్ద స్కానింగ్ చేయించుకోవాలి. లేకుంటే గతంలో ఆచరణలో ఉన్నట్లుగా దివ్య దర్శనం టోకెన్లు కలిగి స్కాన్ చేసుకోని భక్తులను దర్శన క్యూ లైన్లలో అనుమతించరు. కావున భక్తులు ఈ మార్పును గమనించి తదనుగుణంగా దర్శనానికి రావాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

చదువురాని వాడవని దిగులు చెందకు...

యానాది కాలనీలో ఉచితంగా ట్యూషన్ సెంటర్

ప్రజాశక్తి - తిరుపతి సిటి

చదువుకొనలేని పేద విద్యార్థుల తల్లిదండ్రులకు ఓ తీపి కబురు. ప్రభుత్వ పాఠశాలలో ట్యూషన్ చెప్పడం వరం కానుంది. స్థానిక లీలామహల్ , చేపలమార్కెట్ ఎదురుగా , యానాది కాలనీ లోని నగరపాలక సంస్థ పాఠశాలలో గురువారం ట్యూషన్ సెంటర్‌ను ప్రారంభించారు. ప్రతిరోజూ స్కూల్లో చెప్పే పాఠాలను ఇంటిదగ్గర తిరిగి ప్రాక్టీస్ చేసుకోవడానికి వీలులేని విద్యార్థులు ప్రతి ఒక్కరూ ఈ ట్యూషన్ సెంటర్ ద్వారా తర్ఫీదు పొందవచ్చునని... పాఠ్యాంశాలలోని అనుమానాలను అధ్యాపకుల ద్వారా నివత్తి చేసుకొని.. వారి మేధస్సుకు పదును పెట్టి .... ఉన్నత చదువులకు ఎదగవచ్చుననిఅతిధులు తెలియజేశారు. ఈ కార్యక్రమం యశోదనగర్ లోని వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించినట్లు నిర్వాహకులు మేరుగ నాగార్జున తెలిపారు.

ఆకట్టుకున్న వయోలిన్ కచేరి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

చెన్నై వాసి పద్మశ్రీ అవసరాల కన్యాకుమారి వయోలిన్ సోలో కచేరి సభికులను ఆకట్టుకుంది. అలాగే లిధార్వాడ్ బందం శ్రీ జయతీర్థ మేవుండి హిందుస్థాని గాత్ర కచ్చేరి ప్రేక్షకులను రంజింపజేసింది. ఇదే విధంగా శ్రీకాకుళం వాసులు ఆరంగి వెంకట్రావు కవిటి గాత్ర కచ్చేరి ఘనంగా సాగింది. ఇలాగే లితిరుపతి వాస్తవ్యులు కె. శ్రీదేవి, వారి శిష్యులు ఉత్సవ సంప్రదాయ కీర్తనల నత్యం ఎంతగానో అలరించిందిలి. 24 గంటలు , ఏడు రోజులు , నిర్విరామ సప్తగిరి సంగీత సప్తాహంలో భాగంగా స్థానిక యశోద నగర్ లోని వేమన విజ్ఞాన కేంద్రం వేదికగా ఈనెల 23వ తేదీ వరకు కొనసాగనుంది.

చెప్పింది చేస్తాడంతే..!

ప్రక్షాళన దిశగా తిరుమల
చంద్రబాబు నిర్ణయం
శ్యామలరావు అమలు
అధికారుల్లో గుబులు

ప్రజాశక్తి- తిరుమల

తిరుమల వ్యవహారాలన్నీ పర్యవేక్షించే టీటీడీ ప్రక్షాళనకు వేగంగా అడుగులు పడుతున్నాయి. టీడీటీతోనే ప్రక్షాళన ప్రారంభిస్తామని చెప్పిన సీఎం చంద్రబాబు నాయుడు అన్నది చేసి చూపిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే టీటీడీకి కొత్త ఈవోను నియమించారు.

అలా బాధ్యతలు చేపట్టారో లేదో ఇలా ప్రక్షాళన చర్యలు ప్రారంభించారు ఈవో శ్యామలరావు. విస్తత తనిఖీలు, కఠిన చర్యలు, హెచ్చరికలతో పరిస్థితులను గాడిన పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఉన్నతస్థాయి అధికారుల నుంచి కిందిస్థాయి ఉద్యోగులు వరకూ, షాపుల నిర్వాహకుల నుంచి వాహనాల డ్రైవర్ల దాకా అందరూ తిరుమల పవిత్రత పరిరక్షణలో తమవంతు పాత్ర పోషించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఏడుకొండలపై ఎలాంటి అపచారాలు జరగకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకుంటున్నారు.

ఐదేళ్లుగా తిరుమల పరిస్థితులపై అనేకానేక ప్రచారాలు..

శ్రీ వేంకటేశ్వర స్వామిని కనులారా దర్శించుకునేందుకు దేశం నలుమూలల నుంచీ పెద్ద సంఖ్యలో భక్తులు తిరుమలకు తరలివస్తుంటారు. ఎప్పుడూ భక్తజనసంద్రంగా ఉండే తిరుమలగిరుల్లో హరినామస్మరణ మారుమోగుతుంటుంది. ఓం నమో వెంకటేశాయ అన్న అష్టాక్షరి మంత్రం ప్రతిధ్వనితో అణువణువూ ఆధ్యాత్మికత నిండి ఉంటుంది. ఏడు కొండలవాడా వెంకటరమణా.. గోవిందా గోవిందా అంటూ భక్తులు చేసే స్వామి స్మరణ పుణ్యక్షేత్రాన్ని పులకింప చేస్తుంటుంది. అయితే గత ఐదేళ్లుగా తిరుమల పరిస్థితులపై అనేకానేక ప్రచారాలు జరిగాయి.

పవిత్రత దెబ్బతినే ప్రమాదముందని ఆందోళన..

టీటీడీ అక్రమాలపై రోజుకో వార్త వచ్చింది.

ప్రతిరోజూ ప్రక్షాళన దిశగా ఈవో తనిఖీలు

ఎన్నో కష్టనష్టాల కోర్చి తిరుమలకు వస్తున్న భక్తులకు సరైన సౌకర్యాలు ఉండడం లేదని, క్యూలైన్లు మొదలుకుని భక్తులు బస చేసే గదుల వరకు అనేక విషయాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అన్నప్రసాదం, తిరుమల లడ్డూలో నాణ్యత లోపించిందని, తిరుమల కొండపై అన్యమత ప్రచారం జరుగుతోందని, ఇతర మతస్థులను టీటీడీలో ఉన్నత ఉద్యోగాల్లో నియమించారని, మాంసాహారం, గంజాయి, మందు వంటివి కొండపై విరివిగా దొరుకుతున్నాయని ప్రతిపక్షాలు తీవ్ర ఆరోపణలు చేశాయి. తిరుమలకొండ పవిత్రత దెబ్బతినే ప్రమాదముందని ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తంచేశాయి.

తప్పు చేసిన వాళ్లను ప్రక్షాళన చేయాల్సిందే..

ఎన్నికల తర్వాత ఏర్పడిన కూటమి ప్రభుత్వం తిరుమల ప్రక్షాళన చేపడతామని ప్రకటించింది. ఈ నెల 12న సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబు.. అదే రోజు తిరుమల పర్యటనకు వెళ్లారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం తిరుమలపై కీలక ప్రకటనలు చేశారు. తిరుమల నుంచి ప్రక్షాళన ప్రారంభిస్తామని ప్రకటించారు. తప్పు చేసిన వాళ్లను ప్రక్షాళన చేయకపోతే దేవుడు కూడా సహకరించడని, మంచివాళ్లను కాపాడుకోవాలని, చెడు వ్యక్తులను శిక్షించాలని అన్నారు. తిరుమలలో అదే సంకల్పం తీసుకున్నానని చంద్రబాబు తెలిపారు. తిరుమల క్షేత్రాన్ని అపవిత్రం చేయడం భావ్యం కాదని, ఏడుకొండలవాడా, ఓం నమో వెంకటేశాయ నినాదాలు తప్ప తిరుమల గిరుల్లో మరేమి వినిపించకూడదని హెచ్చరించారు.

చెప్పినట్టుగానే టీటీడీ ప్రక్షాళన ప్రారంభం..

తిరుమల స్వామివారిని దర్శించుకుని.. అమరావతిలో సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే చెప్పినట్టుగానే టీటీడీ ప్రక్షాళన ప్రారంభించారు చంద్రబాబు. టీటీడీ ఈవోగా శ్యామలరావును నియమించారు. ఈ నెల 16న టీటీడీ ఈవోగా శ్యామలరావు బాధ్యతలు స్వీకరించారు. క్షేత్ర సాంప్రదాయం పాటిస్తూ తొలుత వరాహస్వామివారిని దర్శించుకున్న శ్యామల రావు ఆలయంలోని గరుడాల్వార్ సన్నిధిలో ఈవోగా బాధ్యతలు చేపట్టారు. సీఎం తన మీద పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, భక్తులకు జీవితాంతం గుర్తుండిపోయేలా సేవ చేస్తానని తెలిపారు. తిరుపతిలోనూ, తిరుమల కొండపైనా ప్రతి ఒక్కటి పారదర్శకంగా, పద్ధతిగా, సంప్రదాయానికి పెద్దపీటవేసేలా, బాధ్యతాయుతంగా ఉండేలా చూస్తామని హామీ ఇచ్చారు. మరుక్షణమే రంగంలోకి దిగిన ఈవో అక్రమాలు, అవినీతిపై, అక్రమార్కులపై కొరడా ఝుళిపించడం మొదలుపెట్టారు.

భక్తులకు అందుతున్న సౌకర్యాల పరిశీలన..

నారాయణ గిరి సర్వదర్శనం క్యూలైన్లలో తనిఖీలు నిర్వహించారు. సర్వ దర్శనం క్యూలైన్లలో పారిశుద్ధ్య లోపంపై సూచనలు చేశారు. తాగునీరు పరిశుభ్రంగా లేకపోవడంపై అసంతప్తి వ్యక్తంచేసిన ఈవో క్యూలైన్లలో భక్తులకు అందుతున్న సౌకర్యాలు పరిశీలించారు. ఆ సమయంలో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను భక్తులు ఈవో దష్టికి తీసుకెళ్లారు. దర్శనం టోకెన్లు, అన్నప్రసాదాలు, పాలు సరఫరా వంటివి పూర్తిస్థాయిలో జరగడం లేదని భక్తులు చెప్పడంతో మెరుగైన సౌకర్యాలు పెంపొందించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. భక్తులకు సౌకర్యాల కల్పన సహా అన్ని అంశాలనూ పరిశీలిస్తూ వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు.

ఊరిస్తున్న రుతుపవనాలు

అడుగంటుతున్న చెరువులు

ప్రజాశక్తి - డక్కిలి

ఓ వైపు వాతావరణ శాఖ రుతుపవనాలు వచ్చేశాయ్ అని ఊరిస్తోంది.. మరోవైపు చెరువుల్లో చుక్కనీరు కానరాక మెట్టప్రాంత రైతుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారనుంది. సకాలంలో రుతుపవనాలు వచ్చినా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం వల్ల వెంకటగిరి నియోజకవర్గంలోని కండలేరు జలాశయంతో పాటు పలు చెరువులు అడుగంటి పోతున్నాయి. ముఖ్యంగా కండలేరు జలాశయం పూర్తిస్థాయిలో అడుగంటి పోయిందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. గత సంవత్సరంకండలేరు జలాశయానికి ఆశించిన రీతిలో నీరు రాకపోవటం వల్ల బ్రాంచికాలువల పరిధిలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సంవత్సరం కూడా జూన్ మాసం పూర్తి కావస్తున్నప్పటికీ నేటి వరకు సరైన వర్షాలు కురవలేదు. కండలేరు జలాశయానికి చుక్కనీరు రాలేదు. ఫలితంగా ఆయకట్టు ప్రాంత రైతుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి.

అడుగంటుతున్న చెరువులు...

వర్షాభావ పరిస్థితుల కారణంగా చెరువులు అడుగంటిపోతుండటంతో రైతుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. కండలేరు బ్రాంచ్ కాలువ పరిధిలో సుమారు 1.8 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది. ఖరీఫ్, రబి సీజన్లో కండలేరు బ్రాంచి కాలువల ద్వారా ఆశించిన స్థాయిలో నీరు రాకపోవటం వల్ల రైతులు బోర్లు, బావుల కింద వ్యవసాయం సాగు చేస్తున్నారు. అప్పట్లోనే సాగునీటికి అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సంవత్సరం కూడా వర్షాభావ పరిస్థితుల్లో ఖరీఫ్ సీజన్లో సాగు చేసుకోవటం ఎలా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కురిసిన కొద్దిపాటి వర్షాలతో రైతులు దుక్కులు దున్నుకుంటున్నారు. మరి కొంతమంది రైతులు బోర్లు బావుల కింద వరిసాగు కు శ్రీకారం చుట్టారు. వాతావరణ శాఖ అధికారులు ఋతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని చెప్పుతున్నప్పటికీ ఫలితం శూన్య మని రైతులు అంటున్నారు. వర్షాల పరిస్థితి ఎలా ఉంటుందోనని నియోజక వర్గం లో అనేక ప్రాంతాల్లో రైతులు వేరుసెనగ వంటి మెట్ట పంటలు సాగు చేస్తున్నారు.

వెంకటగిరి నియోజకవర్గంలో పరిస్థితి ఇదీ...

డక్కిలి మండలం పాతనాలపాడు చెరువులో అరకొరగానే ఉన్న నీరు

నియోజకవర్గంలో ప్రధాన సాగునీటి ప్రాజెక్టు అయిన కండలేరు జలాశయంలో 6.410 టీఎంసీ ల మాత్రమే నీటి నిల్వ ఉంది. వెంకటగిరి రూరల్ అర్బన్ పరిధిలో 102, బాలాయపల్లి మండలంలో 89, డక్కిలి మండలంలో 69 చెరువులు ఉన్నాయి. వీటిలో వెంకటగిరి మండలంలోని కే ఉప్పరపల్లి, పారువోలు చెరువులతో పాటు, డక్కిలి మండలం మోపూరు, దందవోలు చెరువులు మినహా మిగిలిన చెరువుల్లో అరకొరగా నీరు ఉండడంతో భూగర్భ జలాలు అడుగంటి బోరు బావులు సైతం అడుగంటే ప్రమాదం ఉందని రైతు లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

2 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి 40 వేల రూపాయల విలువ చేసే రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఈస్ట్ సీఐ మహేశ్వర్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గంజాయి విక్రాయాలపై నిఘా ఉంచామన్నారు. నగరంలో ఎస్ టి వి నగర్ అంబేద్కర్ నగర్ క్రాస్, ఎయిర్ బైపాస్ రోడ్డు వద్ద అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న నలుగురు వ్యక్తుల్ని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో రేణిగుంటకు చెందిన దినేష్(36), ఎదళ్లచెరువుకు చెందిన మేకల అశోక్ (29), మదనపల్లికి చెందిన చింత గింజల మణికంఠ (29), తిరపతి ఎస్ టి వి నగర్ కు చెందిన భూపతి వాసు (20)లను అదుపులోకి తీసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని వెల్లడించారు. సొత్తు స్వాధీనానికి సహకరించిన సిబ్బందిని అభినందించారు.

ముత్యపు కవచంలో శ్రీ మలయప్ప

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల శ్రీవారి జ్యేష్ఠాభిషేకంలో భాగంగా రెండో రోజు గురువారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు ముత్యపు కవచం ధరించి నాలుగు మాడ వీధులలో విహరిస్తూ భక్తులను మురిపించారు. అంతకుముందు ఉదయం 6.30 గంటలకు శ్రీ మలయప్పస్వామివారు ఉభయనాంచారులతో కలిసి శ్రీవారి ఆలయంలోని సంపంగి ప్రాకారానికి వేంచేపు చేశారు. ఉదయం 8 గంటలకు ఆలయ అర్చకులు, వేదపారాయణదారులు శాస్త్రోక్తంగా మహాశాంతి హోమం నిర్వహించారు. అనంతరం ఉదయం 9 నుండి 11 గంటల వరకు శ్రీ మలయప్ప స్వామివారికి, దేవేరులకు అభిదేయక అభిషేకాన్ని కన్నులపండుగగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్ద జీయర్ స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ ముందున్న 'సవాళ్లు'

సాధిస్తారా..! సాగదీస్తారా..!

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

మాజీ మంత్రి బొజ్జల గోపాలకష్ణారెడ్డి తనయుడు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి గురువారం రాష్ట్ర అసెంబ్లీలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యేగా ప్రమాణం చేయనున్నారు. ప్రజల చేత ఎన్నుకోబడ్డ ప్రజాప్రతినిధిగా నిస్వార్థంగా ప్రజా సేవ చేసేందుకు వస్తున్న ఆయనకు శ్రీకాళహస్తి నియోజకవర్గంలో దీర్ఘ కాలికంగా పరిష్కారం కాని సవాళ్లు ఎదురు కానున్నాయి. ఈ క్రమంలో ఆయన ఆ సవాళ్ళను ఎదురొడ్డి సాధిస్తారా..!! లేక సాగదీస్తారా వేచి చూడాలి మరి. తాను ఎమ్మెల్యేగా గెలిస్తే తన తండ్రి బొజ్జల పాలనను తిరిగి తెస్తానని నియోజకవర్గ ప్రజలకు హామీ ఇచ్చారు. అంతేకాకుండా రాజీవ్ నగర్లో రహదారి అక్రమణలపై ఉక్కుపాదం మోపుతానన్న మాటకు కట్టబడి అక్రమ నిర్మాణాలను కూల్చారు. ప్రజల చేత శభాష్ అనిపించుకున్నారు. ఇదే మార్కు పాలనను అన్నింటా చూపిస్తారా లేదా అన్నది చూడాలి మరి.

మన్నవరం : రాయలసీమకు తలమాణికంగా నిలిచిన మన్నవరం ప్రాజెక్టుకు తిరిగి జవసత్వాలు నింపడం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ముందున్న అతి పెద్ద సవాలు. రూ.6 వేల కోట్ల బడ్జెట్, ప్రత్యక్షంగా పదివేల ఉద్యోగాలు, పరోక్షంగా 20 వేల ఉద్యోగాలు మన్నవరం లక్ష్యం. ఎన్‌టిపిఎల్, బెల్ సంయుక్తంగా ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశాయి. ప్రస్తుతం అంపశయ్యపై ఉన్న ఈ ప్రాజెక్టుకు సుధీర్ రెడ్డి ప్రాణం పోసి రాయలసీమ వాసుల ఆకాంక్షలు నెరవేరుస్తారా. ఎన్డీఏ సంకీర్ణ ప్రభుత్వంలో కీలకంగా టిడిపి వ్యవహరిస్తోంది. ఈ నేపథ్యంలో అసెంబ్లీలో మన్నవరంపై గళమెత్తితే ప్రయోజనం ఉంటుందని ప్రజల ఆశ.

స్కిట్: మాజీ మంత్రి బొజ్జల గోపాలకష్ణారెడ్డి హయంలో ఓ వెలుగు వెలిగింది స్కిట్ ఇంజనీరింగ్ కళాశాల. శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం అనుబంధంగా అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న బొజ్జల గోపాల కష్ణారెడ్డి స్కిట్ కళాశాలకు ఊపిరి పోశారు. ఆయన హయాంలో స్కిట్ కళాశాల రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందింది. ఎంతోమంది ఇంజనీరింగ్ స్టూడెంట్స్ ఇక్కడ తయారయ్యారు. కానీ నిర్వహణా లోపాల కారణంగా స్కిట్ ప్రతిష్ట మసకబారింది. ఏకంగా మూసి వేతకు దారి తీసింది. అక్కడ చదివే విద్యార్థులు, అధ్యాపకులు, బోధ నేతర సిబ్బంది రోడ్డున పడ్డారు. తాను ఎమ్మెల్యేగా గెలిస్తే స్కిట్ కు పూర్వ వైభవం తెస్తానన్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ప్రజా ఆకాంక్షల మేరకు, తన తండ్రి మానస పుత్రిక అయిన స్కిట్ పై అసెంబ్లీలో గళం ఎత్తాల్సిన అవసరం ఉంది.

ఏరియా ఆసుపత్రి : మాజీ మంత్రి బొజ్జల గోపాలకష్ణారెడ్డి మానస పుత్రికగా శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి ప్రాణం పోసుకుంది. పేదల ఆసుపత్రిగా పేరు గడించింది. 100 పడకల ఆసుపత్రిని 200 పడకలుగా అభివద్ధి చేసి కార్పొరేట్ వైద్యం అందిస్తారని మాజీ మంత్రి బొజ్జల గోపాల కష్ణారెడ్డి ఎన్నో పర్యాయాలు ప్రజల ముంగిట వాగ్దానం చేశారు. ప్రస్తుతం ఏరియా ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది కొరత ఉంది. సరైన మౌలిక వసతులు లేవు. అత్యధిక వైద్య పరికరాలు, వాటిని ఆపరేట్ చేసే రేడియాలజిస్టులు లేరు. మరి ఎమ్మెల్యేగా బొజ్జల సుధీర్ రెడ్డి తన తండ్రి కలను నెరవేర్చాల్సిన అవసరం ఉంది.

ఎస్ఎస్ కెనాల్: శ్రీకాళహస్తి ప్రాంతవాసులకు సాగు, తాగు నీరు అందించడమే లక్ష్యంగా సోమశిల- స్వర్ణముఖి బహత్తర ప్రాజెక్టు రూపు దిద్దుకుంది. ప్రభుత్వాలు మారుతున్నాయే తప్పా ఎస్ఎస్ కెనాల్ పనులు ముందుకు సాగడం లేదు. 60 శాతం మేర పనులు పూర్తయిన ఈ ప్రాజెక్టుపై ప్రభుత్వం కనికరిస్తే పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి. బొజ్జల కుటుంబం ఎస్ ఎస్ కెనాల్ పనుల్లో వాటాలు అడగడం వల్లే పని ఆగిందంటూ తాజా మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సుధీర్ రెడ్డి పై ఆరోపణలు చేశారు. ఆ ఆరోపణలను సుధీర్ రెడ్డి ఖండించారు. మరి ఎమ్మెల్యేగా ఎస్ ఎస్ కెనాల్ ప్రాజెక్టు పనులను అసెంబ్లీలో ప్రస్తావించి పూర్తి చేయిస్తే శ్రీకాళహస్తి నియోజకవర్గం లోని సాగు తాగునీటి సమస్యకు పరిష్కారం లభించే అవకాశం ఉంది.

రాజీవ్ నగర్ : శ్రీకాళహస్తి పట్టణ శివారు ప్రాంతంలో ఉన్న రాజీవ్ నగర్ ఓ బేతాళ ప్రశ్నగా మారింది. రాజీవ్ నగర్ లో ఎన్ని స్థలాలు ఉన్నాయి..?ఎన్ని ఆక్రమణకు గురయ్యాయి..? ఎన్ని స్థలాల్లో నిర్మాణాలు జరిగాయి..? వారిలో ఎంతమంది అర్హులు..? ఎంతమంది అనర్హులు..? తేల్చడం అధికారులకే కాదు ప్రజాప్రతినిధులకు సైతం అంతు చిక్కని ప్రశ్నగా మారింది. పుష్పక విమానం లాగా ఎంతమంది వచ్చి ఆక్రమించినా, ఇంకా మిగిలే ఉన్నట్లు రాజీవ్ నగర్ లో తరచూ ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతూనే ఉండటం గమనర్హం. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాం(2004)లో ప్రతి పేద సొంతింటి కల నెరవేచ్చేందుకు రాజీవ్ నగర్‌లో 7000 ఇంటి స్థలాలను మంజూరు చేశారు. లబ్ధిదారులు సకాలంలో ఇల్లు కట్టుకోకపోవడంతో 2750 ఇంటి పట్టాలను ప్రభుత్వం రద్దు చేసింది. అయితే ఏదో కలగూరగంపలా ఏ స్థలం ఎవరిదో..? ఎవరు లబ్ధిదారో..? కనిపెట్టడం కష్టతరమైంది. ఈ క్రమంలోనే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజీవ్ నగర్ లో పెద్ద ఎత్తున నకిలీ పట్టాల కుంభకోణం జరిగినట్టు అప్పటి ప్రతిపక్ష నాయకుడు, ప్రస్తుత ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పెద్ద ఎత్తున ఆరోపణలు చేశారు. రాజీవ్ నగర్ ఆక్రమణలతోపాటు, రహదారి ఆక్రమణ పైనా ఉక్కు పాదం మోపుతానని హెచ్చరించారు. అనుకున్నట్లుగానే రహదారి ఆక్రమణలపై కొరఢా జులుపించిన ఆయన రాజీవ్ నగర్ లోపల జరిగిన స్థలాలు, నకిలీ పట్టాల అవినీతి పైన ఇదే తరహాలో ఉక్కు పాదం మోపుతారా లేదా వేచి చూడాలి మరి.

రహదారి ఆక్రమణల తొలగింపుతో మొదలు

13 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ఇద్దరు స్మగ్లర్లు అరెస్టు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

శేషాచలం అటవీ పరిధిలోని అన్నమయ్య జిల్లా రాయవరం అటవీ ప్రాంతంలో కారుతో సహా 13 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని, ఇద్దరు స్మగ్లర్లను టాస్క్ ఫోర్సు అధికారులు అదుపులోకి తీసుకున్నారు. టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ.శ్రీనివాస్ ఆదేశాల మేరకు డీఎస్పీ చెంచుబాబు అధ్వర్యంలో ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐలు లింగాధర్, విశ్వనాథ్ బందాలు బుధవారం అన్నమయ్య జిల్లా రాయచోటి మీదుగా కూంబింగ్ నిర్వహిస్తుండగా రాయవరం అటవీ ప్రాంతంలోని సుండుపల్లి ఫారెస్ట్ బీట్ పరిధిలో సుండుపల్లి రోడ్డులో గంగోత్రి రస్తా వద్దకు చేరి అక్కడ వాహనాల తనిఖీలు చేపట్టారన్నారు. అర్థరాత్రి సమయంలో సుండుపల్లి-సానిపాయ జంక్షన్ నుంచి రెండు మోటారు సైకిళ్లలో ముగ్గురు వ్యక్తులు వస్తూ, టాస్క్ ఫోర్సు సిబ్బందిని చూసి పారిపోయే ప్రయత్నం చేశారన్నారు. ఆ ప్రయత్నంలో ఒక వ్యక్తి కిందపడి తలకు గాయం అయ్యింది. అతనితో పాటు, మరో వ్యక్తిని టాస్క్ ఫోర్సు సిబ్బంది పట్టుకున్నారు. వీరిని అనుసరిస్తూ వచ్చిన కారులోని వ్యక్తులు కారు ఆపేసి పారిపోయారన్నారు. కారులో వెనుక సీటును తొలగించి చూడగా అందులో 13ఎర్రచందనం దుంగలను రవాణా చేస్తున్నట్లు నిర్ధారణకు వచ్చామన్నారు. పట్టుబడిన వారు తమిళనాడు వేలూరు జిల్లా కేవీ కుప్పంకు చెందిన శరత్ కుమార్ రవి (23), అదే జిల్లా అనైకట్టు తాలూకాకు చెందిన దేవరాజ్ గోవిందస్వామి (27)లుగా గుర్తించామన్నారు. వీరిని విచారించగా, పారిపోయిన వారితో పాటు ఇంకా 12మంది స్మగ్లర్లు ఉన్నట్లు సమాచారం ఇచ్చారన్నారు. వారిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టామన్నారు. వీరిని తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్ కు తీసుకుని వచ్చి కేసు నమోదు చేసి సీఐ సురేష్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారన్నారు. ఈ ఆపరేషన్ లో అటవీ శాఖకు చెందిన డీఆర్ఓ రమేష్ బాబు, ఎఫ్ బీఓ లక్ష్మీప్రసన్న పాల్గొన్నారని, ఆపరేషన్ లో పాల్గొన్న సిబ్బందికి ఎస్పీ శ్రీనివాస్ రివార్డులను సిఫార్సు చేశారన్నారు

రుయాలో పనిభారం తగ్గించాలని వినతి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రుయా ఆసుపత్రిలో పెరిగిన పనిభారం సిబ్బందిపై విపరీతమైన ప్రభావం చూపుతోందని, తక్షణం ఖాళీలను భర్తీ చేసి సమస్యలను పరిష్కరించాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ రవి ప్రభు కు వినతిపత్రం సమర్పించారు. గౌరవ అధ్యక్షులు కందారపు మురళి, అధ్యక్షులు ముని చంద్ర, ప్రధాన కార్యదర్శి నరసింహులు, కార్యదర్శి పి. గురవయ్య ఆధ్వర్యంలో గురువారం ఉదయం రవి ప్రభు కు వినతిపత్రం సమర్పించారు. 1195 పడకలు ఉన్న రుయా ఆసుపత్రిలో పడకల సామర్థ్యం ప్రకారం సిబ్బంది లేరని, ఈ కారణంగా తీవ్రమైన పని భారం సిబ్బందిపై పడిందని ఆరోపించారు. పర్మినెంట్ ఉద్యోగాల భర్తీ పూర్తిగా మర్చిపోయారని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, ఆప్కాస్ పద్ధతిలో తీసుకున్న పోస్టులు సైతం ఖాళీగా ఉన్నాయని, వీటి భర్తీ విషయంలో యాజమాన్యం తీవ్రమైన అలసత్వం ప్రదర్శిస్తోందన్నారు. నూతనంగా ఏర్పడిన చంద్రబాబు ప్రభుత్వం సిబ్బందిని పెంచి, పని భారం తగ్గించాలని కోరారు. స్థానికంగా పరిష్కరించాల్సిన యూనిఫామ్, సీనియారిటీ పాటించటం. ఆరోగ్యశ్రీ రుసుము చెల్లించటం, దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న పిఆర్ సి ఇంక్రిమెంట్లు క్లియర్ చేయటం, ఐదు నెలలుగా బ్యాలెన్స్ పీఎఫ్ డబ్బులు జమ చేయకపోవడం వంటి సాధారణ సమస్యలు కూడా పరిష్కారం కావడం లేదని పలుమార్లు విన్నవించినా సాకులు చెబుతూ నెలల తరబడి సాగదీస్తున్నారని వాపోయారు. రుయా సూపరింటెండెంట్ రవిప్రభు స్పందిస్తూ తక్షణం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.నాగరాజు, రుయా ఉద్యోగుల సంఘం నాయకులు టి. నాగ పద్మలత, ఎం. లీలావతి, బి. హరికుమార్, కె. లక్ష్మీనారాయణ, తులసీరామ్, వెంకటేశు, ప్రసాదు, శాంతమ్మ, రాధా, నవమణి, ఉత్తర కుమారి, కాంచనమాల తదితరులు పాల్గొన్నారు.

అనుపల్లి సచివాలయంలో ప్రోటోకాల్ ఫొటోలు ఏర్పాటు

ప్రజాశక్తి-రామచంద్రాపురం: మండలంలోని అనుపల్లి గ్రామ సచివాలయంలో ప్రోటోకాల్ ఫొటోలను టీడీపీ నాయకులు ఏర్పాటు చేశారు. గురువారం గ్రామ సచివాలయంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, స్థానిక శాసనసభ్యులు పులివర్తి వెంకట మణి ప్రసాద్(నాని) ఫోటోలను పంచాయతీ కార్యదర్శి భువన అనుమతితో ఏర్పాటు చేశారు. స్థానిక టిడిపి యూత్ నాయకులు బండి విజయ్‌కుమార్ రెడ్డి, బొడ్డు మధురాయుల్‌లు సొంత నిధులతో తయారు చేయించిన అభిమాన నాయకుల ఫోటోలను మండల తహశీల్దార్, ఎంపీడీవో, పోలీస్ స్టేషన్, సింగల్ విండో కార్యాలయాలలో మండలం నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆకా దేవరాజులు, బొడ్డు సోమురాయల్, గజ్జెల మహేష్, బోడి రెడ్డి పురుషోత్తం రెడ్డి, వెంకటేష్ రెడ్డి, వెంకటేష్ నాయుడు, దేవరాజు రెడ్డి, సిద్దయ్య యాదవ్, జగదీష్, సుబ్రహ్మణ్యం రెడ్డి పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

భూమి పూజ చేపడుతున్న దాతలు

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లివెట్టు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుల తల్లి సరస్వతి దేవి విగ్రహానికి విగ్రహ దాత సుందర్ రెడ్డి దంపతులు గురు వారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కుమారుడు రమష్ రెడ్డి(దుబాయ్) సరస్వతి దేవి గుడి నిర్మాణానికి స్వంత గ్రామంలోని పాఠశాలలో విగ్రహం పెట్టాలనే కోరికతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం రూపేష్‌కుమార్, ఉపాధ్యాయులు యువశ్రీ, మురళి, సురేష్ బాబు, మురళి, ప్రసాద్, దాసు, దేవేంద్ర, లక్ష్మయ్య, జగన్నాధం, మురళీ ప్రసాద్, దీపిక పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం



అన్నదానం చేపడుతున్న టీడీపీ నాయకులు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ జన్మదినం సందర్భంగా పుత్తూరు మున్సిపాలిటీలోని 16వ వార్డు టీడీపీ నాయకులు పి.భాస్కర్, లక్ష్మణాచ్చారి, రమేష్‌లు టౌన్ టీడీపీ పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం చేపట్టారు. గురువారం పుత్తూరు–కార్వేటినగరం రోడ్డులోని వృద్ధాశ్రమలో అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-తిరుపతిడెస్క్: ఏర్పేడు మండలం ఎండి పుత్తూరు గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరపు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సర్పంచ్ మోహన ప్రియ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకొచ్చి గొప్పగా అభివృద్ధి చెందాలని పిల్లలను కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దొరస్వామి యాదవ్, పాఠశాల ఉపాధ్యాయురాలు సునీత, పంచాయతీ కార్యదర్శి లోకముని సిబ్బంది పాల్గొన్నారు.

పోలేరమ్మ సేవలో ఎమ్మెల్యే కురుగొండ్ల

ప్రజాశక్తి-వెంకటగిరి రూరల్: వెంకటగిరి పట్టణంలోని బంగారుపేటలో జరిగిన శ్రీ పోలేరమ్మ జాతరలో పాల్గొని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. 9సంవత్సరాలకు ఒకసారి జరిగే పోలేరమ్మ జాతరను బంగారుపేట వాసులు ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు.

ఏసీ బహూకరణ



ప్రజాశక్తి-క్యాంపస్: ఎస్వీయూ ప్రాచ్య పరిశోధన సంస్థను గత నెల 1న అమెరికాలో అట్లాంటా రాష్ట్రంలో జార్జియాలో ప్రతిష్టాత్మక కంపెనీలు నిర్వహిస్తున్న శ్రీనురెడ్డి (సెరినిటీ ఇన్ఫోటెక్), ఉపేంద్ర రెడ్డి(విజన్ ఇన్ఫోటెక్), రాజశేఖర్ రెడ్డి(సి విజన్ ఇన్ఫోటెక్) ముగ్గురు ప్రవాస భారతీయులు సందర్శించారు. వారు సంస్థలో భద్రపరచబడిన ప్రాచీన రాతప్రతులను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తాళపత్ర, కాగితప్రతుల్లో నిక్షిప్తం చేసిన జ్ఞానసంపదను, లిపులు, అందమైన అక్షరాలు తీర్చడంలో మన ప్రాచీనులు కనబరచిన నైపుణ్యాన్ని చూసి తెలుసుకున్నారు. మన ప్రాచీన జ్ఞానాన్ని సంరక్షిస్తున్న సంస్థ అభివృద్ధికి, నవీనీకరణకు తాము సహకరిస్తామని తెలిపారు. ఆ మాట ప్రకారం గురువారం ఏసి యూనిట్‌ను వారు విజయ్‌భాస్కర్ రెడ్డి, సుందర్‌ల ద్వారా ఓఆర్ఐ సంచాలకులు ఆచార్య పి.సి.వెంకటేశ్వర్లుకు అందజేశారు. ఈ సందర్భంగా ఓఆర్ఐ డైరెక్టర్ ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రాచీన తాళపత్ర గ్రంథ సంపదను కాపాడడంలో ఎన్నారైలు తమ వంతు సహాయ సహకారాలు అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో ఎస్వీ యూనివర్సిటీలో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించి ఎన్నారైలుగా ప్రవాస నివాసం ఏర్పరచుకున్న భారతీయులు ఓఆర్ఐ సంస్థకు మరిన్ని సహాయ, సహకారాలు అందించి ప్రాచీన తాళపత్ర గ్రంధాలలోని విషయాలను గ్రంథస్తం చేయుటకు సహకరించాలని సూచించారు.

మహిళలకు చీరల వితరణ

చీరలు పంపణీ చేస్తున్న ప్రగతి సేవా సంస్థ సభ్యులు

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని బాలాజీ నగర్‌లోని ప్రగతి సేవా సంస్థ కార్యాలయంలో ప్రగతి సేవా సంస్థ ఉపాధ్యక్షులు బండి ధనుంజయ రెడ్డి పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికి పంచి పెట్టారు. అనంతరం 50మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పధాన్ని అలవర్చుకోవాలన్నారు. సంస్థ సభ్యుల సహకారంతో తమ సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ట్రెజరర్ కాటూరు శ్రీనివాసులు, రామకృష్ణ, కార్యవర్గ సభ్యులు శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, రాము, వెంకట కృష్ణయ్య, శ్యామ్, శ్రీహరి, శీను, ముని ప్రసాద్, నాగరాజు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని రాచగున్నేరి పంచాయతీలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ సర్పంచ్, జె.కె స్టీల్స్ అధినేత, టీడీపీ నాయకులు బొల్లినేని జగన్నాథం నాయుడు పాల్గొన్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, మూడు జతల యూనిఫామ్ దుస్తులు, బ్యాగులు, బెల్టులు షూలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రమౌళి నాయుడు, మునిబాబు, మురళి, పాఠశాల హెచ్ఎం గిరిజ, ఉపాధ్యాయులు లింకన్, శాంతకుమారి, ప్రజాప్రగతి ట్రస్ట్ ఇంచార్జ్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు
పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి-తిరుపతిడెస్క్: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కేవీబీ పురం ఎస్ఐ షరీఫ్ హెచ్చరించారు. గురువారం ఆయన మండలంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. మందుబాబుల స్థావరాలను పరిశీలించారు. అక్కడి స్థానికుల సాయంతో పరిసరాలను పరిశుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రి వేళల్లో స్థానిక హాస్టల్, తహశీల్దార్ కార్యాలయ పరిసరాలు, ఆర్అండ్‌బి కార్యాలయ ఆవరణలో కొందరు ఆకతాయిలు నిత్యం మద్యం సేవిస్తున్నట్లు తమకు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఇలా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం ద్వారా దొంగతనాలు, మహిళలపై అఘాయిత్యాలు, క్షణికావేశంలో హత్యలు వంటి నేరాలకు పాల్పడే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. అలాంటి వారిపై కఠినమైన సెక్షన్‌లతో కేసులు నమోదు చేసి చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ లోకనాథం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మాతా శిశు మరణాల నివారణే లక్ష్యం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్: మాతాశిశు మరణాల నివారణే లక్ష్యంగా వైద్య సిబ్బంది పనిచేయాలని తిరుపతి జిల్లా టాస్కోర్స్ ప్రధాన అధికారి డాక్టర్ శ్రీనివాస రావు ఆదేశించారు. టాస్క్ ఫోర్స్ బృందంలోని జిల్లా గణాంకాధికారి నాగేంద్ర కుమార్, ఇన్‌ఛార్జ్ డీపీహెచ్ ఎం.ఓ బేబిరాణి, డీపీఓ ప్రకాష్ గురువారం మండలంలోని ముచ్చివోలు విలేజ్ హెల్త్ క్లినిక్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు, గర్భిణులు, బాలింతలు రక్తహీనతతో మరణించ కూడదని, అందుకు సంబంధించిన వైద్య సదుపాయాలు సకాలంలో అందించి, రక్తహీనత సమస్య లేకుండా చూడాలని తెలిపారు. ప్రతి కాన్పు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగేలా చూడాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు ఇచ్చే బలవర్ధక ఆహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా చూడాలని కోరారు. ఎప్పటికప్పుడు గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామస్థాయిలో పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చి దోమల నివారణకు చర్యలు పరిశీలించి ధ్రువీకరించారు. డాక్టర్ రంజిత, పిహెచ్ఎన్ అమ్మనమ్మ, ఏఎన్ఎంలు, ఎమ్ఎల్‌హెచ్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నివారణకు చర్యలు

దోమల నివారణ చర్యలు చేపడుతున్న అధికారులు

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: ఏర్పేడు బీసీ బాలుర వసతి గృహంలో గురువారం మలేరియా దోమల నివారణ చర్యలు చేపట్టారు. తొలకరి వర్షాలు ప్రభావం కావడం, నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కావడం, విద్యార్థులు వసతి గృహాలకు చేరుకోవడంతో దోమల బెడదను నియంత్రణ కోసం, శ్రీకాళహస్తి మలేరియా సబ్ యూనిట్ అధికారి పి.శివకుమార్ ఆధ్వర్యంలో మాలాథియన్ మరుగుదొడ్లు, స్నానపు గదులు, విద్యార్థుల గదులు, వసతి గృహ పరిసరాలలో దోమలు ప్రబలకుండా పిచికారి చేశారు. ఈ కార్యక్రమం వసతి గృహ సంక్షేమ అధికారి పల్లా వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో జరిగింది. కార్యక్రమంలో వసతి గృహ సిబ్బంది, ఆశా వర్కర్ లత పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

ప్రజాశక్తి-రామచంద్రాపురం: బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ఎంఈఓలు మార్కొండయ్య నాయుడు, జయవేలు అన్నారు. గురువారం స్థానిక ఆర్‌సి పురం ఎస్టీ కాలనీలో నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్మ కండ్రిగ ఉన్నత పాఠశాల నుంచి ఆర్సి పురం ఎస్టీ కాలనీ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ 6-14 ఏళ్ల పిల్లలందరూ బడుల్లోనే ఉండాలని చెప్పారు. డ్రాపౌట్ పిల్లలను తిరిగి స్కూళ్లలో చేర్పించాలన్నదే నేను బడికి పోతా కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఇంటింటికి వెళ్లి బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించామన్నారు. పిల్లలను బడిలో చేర్పించడం ప్రతి ఒక్కరికి సామాజిక బాధ్యతగా భావించాలని కోరారు. చిన్నారుల ఉజ్వల భవిష్యత్తు కోసం బడికి పంపుదామని పిలుపునిచ్చారు. ప్రభుత్వ బడుల్లో స్టూడెంట్ కిట్లు, నాణ్యమైన భోజనం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వాగ్దేవి, ఉపాధ్యాయులు, సీఎంఆర్టీలు, పాల్గొన్నారు.

కళ్యాణం.. కమనీయం

- వైభవంగా ప్రసన్న వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం
- కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై విహరించిన స్వామివారు

ప్రజాశక్తి-రామచంద్రపురం: టీటీడీ అనుబంధ దేవాలయమైన అప్పలాయ గుంటలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం కల్పవృక్ష వాహనంలో శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సుప్రభాత సేవతో స్వామిని మేల్కొల్పి, మూల విగ్రహానికి వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి బంగారు ఆభరణాలు, పట్టు వస్త్రాలు, వివిధ పుష్పాలతో అలంకరించి ధూపదీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని వాహన మండపంలో కల్ప వృక్ష వాహనంపై అధిష్టింపజేసి స్వామివారిని విశేషంగా అలంకరించి మంగళ వాయిద్యాలు, భక్త భజనలు, కోలాటాలు, వేద మంత్రోచ్చరణాలు, గోవింద నామస్మరణ నడుమ ఊరేగింపు నిర్వహించారు. భక్తులు స్వామివారికి కర్పూర హారతి నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ రమేష్, సూపరింటెంట్ శ్రీవాణి టెంపుల్ ఇన్స్పెక్టర్ శివకుమార్, ఆలయ అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాలలో మద్యపాన నిషేధం

- ఎవరైనా అతిక్రమిస్తే, కఠిన చర్యలు తప్పవు: ఎస్పీ

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: బహిరంగ ప్రదేశాలలో మద్యపానం సేవించడం, ధూమపానం తాగడం పూర్తిగా నిషేధం విధించాలని, దీనిని అమలు చేయాలని, ఈ నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం కట్టిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ హర్షవర్ధన్ రాజు పోలీసు అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఎస్‌హెచ్‌వోలు తమ పరిధిలోని బహిరంగంగా మద్యం సేవించే ప్రదేశాలను గుర్తించి, పంచాయతీరాజ్, మున్సిపాలిటీ శాఖల సిబ్బంది సహకారంతో క్షేత్రస్థాయిలో స్వయంగా పోలీసులు బహిరంగంగా మద్యం సేవించే ప్రదేశాలను పరిశీలించారు. అయితే శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పరిధిలో జిల్లా ఎస్పీ స్వయంగా బహిరంగంగా మద్యపానం సేవించే ప్రదేశాలలో తనిఖీ చేసినారు ఫలితంగా బహిరంగంగా మద్యం సేవించే ప్రదేశాలు కనుమరుగై ప్రజలు బహిరంగంగా మద్యం సేవించకుండా ఉండడం వలన కొంతమేర నేరాలు తగ్గుముఖం పడతాయని ఎస్పీ ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఎస్పీలు వెంకటాద్రి, ఉమామహేశ్వర్ రెడ్డి, శ్రీకాళహస్తి సబ్ డివిజన్ సిఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, శ్రీకాళహస్తి మున్సిపాలిటీ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయ యోగ సదస్సు ప్రారంభం

ప్రజాశక్తి-క్యాంపస్: అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని రెండు రోజులు పాటు జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ యోగ సదస్సు ప్రారంభోత్సవం గురువారం విశ్వవిద్యాలయంలోని ప్రముఖ రమారంజన్ ముఖర్జీ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మధ్యప్రదేశ్, సాగర్ ప్రదేశంలోని డా.హరిసింగ్ గౌర్ యూనివర్సిటీ, యోగ విభాగం రిటైర్డ్ ప్రొ.గణేష్ శంకర్ విచ్చేసి ముఖ్య అతిథి భాషణం చేయడం జరిగింది. ఆయన మాట్లాడుతూ యోగశాస్త్రం అనేటువంటిది భారతదేశ సంపత్తిలో ఒకటి యోగ అనేటువంటి ప్రక్రియ రోజువారి ప్రక్రియగా జరగాలని, రోగం వచ్చినప్పుడు మాత్రమే యోగ కాకుండా, రోగం రాకుండా యోగ చేసేటువంటి విధానాన్ని ప్రజలందరూ అలవర్చుకోవాలని తెలిపారు. యోగ శాస్త్రంలో చెప్పినటువంటి పద్ధతులను అవలంబించడం ద్వారా ప్రతి ఒక్కరు ఇంద్రియ నిగ్రహం, మానసిక ప్రశాంతత, శారీరక దార్ఢ్యం మొదలైనటువంటి గొప్ప ప్రయోజనాలను పొందవచ్చని వివరించారు. ప్రతి ఒక్కరు కూడా యోగాను దైనందిన జీవితంలో నిత్యప్రక్రియగా చేసుకోవాలని

సూచించారు. విశిష్ట అతిథిగా విచ్చేసినటువంటి ఆర్ఎస్ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర ప్రచారక్ భరత్‌కుమార్ మాట్లాడుతూ యోగ శాస్త్రం అనేది భారతదేశానికి మన భారతీయ మహర్షుల అందించిన గొప్ప సంపత్తుగా ఆయన వర్ణించారు. యోగశాస్త్రం ద్వారా శారీరిక, మానసిక ప్రశాంతతో పాటు ఆధ్యాత్మిక చింతనం కూడా వృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరు కూడా యోగ శాస్త్రాన్ని అందులో తెలిపిన పద్ధతులను తెలుసుకుని చక్కగా వాటిని పాటిస్తూ ఆరోగ్యవంతమైనటువంటి జీవితాన్ని జీవించాలని వివరించారు. ఇండియన్ యోగ అసోసియేషన్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నెంబర్ డాక్టర్ ఆర్.ఎలన్గోవన్ మాట్లాడుతూ యోగ ప్రక్రియను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ దైనందిన జీవితంలో నుసరించవలసినటువంటి ముఖ్య విధిగా ఆయన వర్ణించారు. ప్రతిరోజు యోగ పద్ధతిని అనుసరించి జీవించడం వలన మనసు దృఢంగాను, ఒత్తిడి లేని ఆలోచనలు చేయగల సామర్థ్యాన్ని పొందగలరని వివరించారు. శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేద కళాశాల యొక్క ప్రిన్సిపల్ డాక్టర్ రేణు దీక్షిత్ మాట్లాడుతూ ఆయుర్వేద శాస్త్రాన్ని, యోగశాస్త్రాన్ని కూడా పరస్పర సహ సహకారంతో అవగాహనతో ఆధునిక కాలంలో ఉన్నటువంటి వివిధ రోగాలను నివారించవచ్చని వివరించారు. కార్యక్రమంలో అకాడమిక్ డీన్ ప్రొఫెసర్ టీవీ రాఘవాచార్యులు, ఇన్చార్జి రిజిస్టర్ ప్రొఫెసర్ ఆర్.జె.రమాశ్రీ, విభిన్న విభాగాల అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్స్, యోగ విభాగ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గంగ జాతర మహోత్సవం

- అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి-రేణిగుంట: రేణిగుంట మండలం గుత్తివారిపల్లి గ్రామంలో గంగమ్మ జాతర మహోత్సవాలు వైభవంగా జరిగాయి. పార్టీలకు అతీతంగా జాతర సంబరాలను బంధు మిత్రులతో కలిసి గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. గంగమ్మ తల్లిని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం దర్శించుకుని తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. బుధవారం రాత్రి మేళతాళాలతో ఊరేగిన గంగమ్మ తల్లి గురువారం తెల్లవారుజామున నడివీధిలో అమ్మవారు కొలువు తీరారు. భక్తులు అమ్మవారికి పెద్ద ఎత్తున ధూప దీప నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పార్టీలకతీతంగా గ్రామస్తులు బంధుమిత్రులతో కలిసి జాతర సంబరాలను జరుపుకున్నారు. డప్పుల దరువులకు సాంప్రదాయ పద్ధతిలో నృత్యాలు చేస్తూ, చిన్న పెద్ద తేడా లేకుండా ఆనందంగా ఉత్సవాలను జరుపుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక వేషధారణలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం జాతర మహోత్సవంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్థానిక వైసిపి నాయకులు సింగిల్ విండో మాజీ చైర్మన్ గాండీవరం గణేష్ రెడ్డి, తిరుమలరెడ్డి సుబ్రమణ్యమును శాలువలతో సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు.

ఎమ్మెల్యేకి ముస్లిం నేతల శుభాకాంక్షలు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పుట్టిన రోజు సందర్భంగా వారి స్వగృహంలో ముస్లిం, మైనారిటీలు శుభాకాంక్షలు తెలిపారు. పుత్తూరు పట్టణం గేట్ మసీదు ఇమాంసాహెబ్‌తో ప్రత్యేక దువాప్రార్థనలు చేసి ఆయురారోగ్యాలతో ఉండాలంటూ అల్లాహ్ దగ్గర వేడుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మైనారిటీల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఎం.డి.మహమ్మద్ గౌస్, ఎస్.డి.జమాల్ అలీషా, ఎస్.కే. షబ్బార్,షేక్. సందాని, షేక్.హమీద్ బాషా పాల్గొన్నారు.

26న సామూహిక అక్షరాభ్యాసం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర ఆలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఈ నెల 26న బుధవారం ఉదయం 9.30గంటలకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి ఎస్వీ నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీకాళహస్తి పరిసర ప్రాంతంలో గల చిన్నారులు ఈ సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో అక్షరాలు దిద్దుకుంటే విద్య బాగా ప్రాప్తిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

గబ్బర్‌సింగ్ ఆన్ డ్యూటీ స్మగ్లర్లలో వణుకు

- ఎర్ర స్మగ్లింగ్ నిరోధించేందుకు ప్రభుత్వం కార్యచరణ..
- అటవీశాఖ మంత్రి పవణ్‌కళ్యాణ్ సారథ్యంలో అధికారుల ప్రణాళికలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అడవుల నుంచి దశాబ్దాల కాలంగా ఎర్రచందనం దుంగలను తీసుకెళ్లి అక్రమంగా అర్జిస్తూనే ఉన్నారు. గతంలో ఎర్రచందనం స్మగ్లింగ్ పట్ల అంత ప్రాచుర్యం లేకపోవడం, ప్రత్యేక విభాగాలు పర్యవేక్షణ లేకపోవడంతో ఎర్రచందనం అక్రమ రవాణా పెచ్చు మీరి అడ్డు వస్తే అధికారులను అంతమొందించే స్థాయికి ఎదిగిపోయి అక్రమ రవాణా సాగిపోయేది. కానీ ఎర్రచందనం అక్రమ రవాణా ద్వారా కోట్లు గడిస్తున్నారు.. సహజ సంపదను నాశనం చేస్తున్నారు. అన్న విషయాలను పరిగణలోకి తీసుకున్న 2014లో ఏర్పడిన చంద్రబాబు ప్రభుత్వం ఎర్రచందనం పరిరక్షణకు ప్రత్యేక కార్యదళాన్ని ఏర్పాటు చేసింది. వారికి పూర్తి హక్కులను కల్పిస్తూ నడుం బిగించింది. ఎర్రచందనం అక్రమ రవాణాలో పేరు మోసిన అనేక మంది కింగ్‌పిన్‌లను టాస్క్ ఫోర్స్ అరెస్టు చేయగలిగింది. టాస్క్‌ఫోర్స్‌కు అప్పటి ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా వ్యవహరించిన మాగంటి కాంతారావు ఎర్రచందనం పరిరక్షణకు ప్రత్యేక కార్యచరణ రూపొందించి ఎప్పటికప్పుడు తనిఖీ బృందాలను అప్రమత్తం చేస్తూ నూతన టెక్నాలజీని అందిపుచ్చుకునేలా కార్యశాలలను నిర్వహించారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ హాయంలో ఎర్రచందనం అక్రమ రవాణా జోరుగా సాగిందనే విమర్శలు లేకపోలేదు. రాజకీయ నాయకుల అండదండలతో వారి ప్రధాన అనుచరులు ఎర్రచందనం అక్రమ రవాణా చేసి కోట్లు దండుకున్నారని అప్పటి ప్రతిపక్షమైన తెలుగుదేశం పార్టీ నేతలు అధికార పార్టీ నాయకులపై తీవ్ర విమర్శలు చేశారు కూడా.

ఒకానొక దశలో..

ఎర్రచందనం పరిరక్షణ కోసం ఏర్పాటైన ఎర్రచందనం పరిరక్షణ ప్రత్యేక కార్యాలయంలో విధులు నిర్వహించే బృందాలు స్మగ్లర్లను అడ్డుకోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేసి దొంగలను స్వాధీనం చేసుకునేవారు. అయితే గత ఏడాది పీలేరు వద్ద ఎర్రచందనం పరిరక్షణ ప్రత్యేక కార్య దళం బృందం రాత్రి సమయంలో వాహనాల తనిఖీ చేస్తుండగా స్మగ్లర్ల వాహనం కానిస్టేబుల్ గణేష్‌పైకి దూసుకెల్లడంతో అతను అక్కడికక్కడే మరణించడం జరిగింది. అటు తర్వాత ఏర్పాటు సమీపంలోని చింతలపాలెం చెక్ పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న మరో కానిస్టేబుల్ ప్రభాకర్ రావును కూడా స్మగ్లర్ల వాహనం ఢీకొనింది. ఈ సంఘటనలో కానిస్టేబుల్ ప్రభాకర్ రావుకు తీవ్ర గాయాలు కావడంతో అమర హాస్పిటల్లో అధికారులు చికిత్స చేయించారు. స్మగ్లర్లను అదుపు చేయడం టాస్క్ ఫోర్స్‌కు కత్తి మీద సాములా మారింది.

గత ప్రభుత్వ హాయంలో కేసులు నమోదుపై..

వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎర్రచందనం పరిరక్షణ కార్యాదళం పనితీరుపై విమర్శలు వచ్చాయి. సిబ్బందికి రక్షణ కల్పించడంలో అధికారులు పర్యవేక్షణ కొరవడిందని, అందుకే స్మగ్లర్లు బరితెగించి సిబ్బందిపైకి దాడులకు తెగబడుతున్నారని ఆరోపణలు లేకపోలేవు. ఎర్రచందనం అక్రమ రవాణాలో గత ప్రభుత్వ హాయంలో నమోదైన కేసులపై కూడా నూతనంగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం.

శాటిలైట్ ఫోన్ల వినియోగం..

ఎర్రచందనం పరిరక్షణ కోసం విధులు నిర్వహిస్తున్న టాస్క్ ఫోర్స్ సిబ్బందికి సమాచారం కేంద్ర కార్యాలయానికి చేరడానికి క్షేత్రస్థాయి నుంచి సమాచారాన్ని ఇవ్వడానికి శాటిలైట్ ఫోన్లను టాస్క్ ఫోర్స్ అధికారులు అందుబాటులోకి తీసుకొచ్చారు. వీటి పనితీరుపై, వినియోగంపై సిబ్బందికి అవగాహన కార్యక్రమాలను కూడా నిర్వహించారు. అడవులలో స్మగ్లర్ల నుండి ఏదేని ముక్కు వాటిలితే వెంటనే అదనపు బలగాలను ఆయా సంఘటన ప్రాంతాలకు పంపడానికి శాటిలైట్ ఫోన్లు వినియోగం మంచి సహకారాన్ని అందిస్తుందని అధికారులు చెప్పారు.

స్మగ్లర్లలో వణుకు..

మొండివాడుగా పేరుగాంచిన జనసేన పార్టీ అధినేత కూటమి ప్రభుత్వం ఏర్పాటులో కీలకంగా వ్యవహరించిన ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపడానికి తనదైన శైలిలో స్వీయ ప్రణాళికలు చేసి అధికారులతో సమీక్ష సమావేశంలో తదనగుణంగా ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. సచివాలయంలోని తన క్యాంపు కార్యాలయంలో పదవి బాధ్యతలు చేపట్టిన పవన్ కళ్యాణ్ దాదాపు 10గంటల పాటు తనకు కేటాయించిన శాఖల అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశంలో ఎర్రచందనం అక్రమ రవాణాపై కూడా చర్చ జరిగినట్టుగా సమాచారం. ఎర్రచందనం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడం పట్ల ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసి, సహజ సంపదను భావితరాలకు అందించాలని లక్ష్యంతో అధికారులు తమ విధులు నిర్వహించేలా ఆదేశాలు ఇచ్చినట్లుగా తెలుస్తోంది. ఇదే అమలు అయితే ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడే వారి పట్ల కూటమి ప్రభుత్వం కఠినంగా చర్యలు తీసుకుంటుందని స్పష్టమవుతోంది. గతంలో ఎర్రచందనం అక్రమ రవాణా చేసిన వారిపై కూడా ప్రత్యేకంగా నిఘా ఉంచి తిరిగి వారు గత ప్రవృత్తులను పునరావృత్తం చేస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడకుండా అధికారులకు ప్రత్యేక అధికారాలను ఇచ్చే విధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఏది ఏమైనా సినిమాలో గబ్బర్‌సింగ్ రియల్‌లో పవన్ కళ్యాణ్ అటవీ శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టడంతో శేషాచలం పరిధిలో ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడే వారి గుండెల్లో గుబులు మొదలైందనే చెప్పాలి.

తెప్పపై పద్మావతి అమ్మవారు

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: తిరుచానూరు పద్మావతి అమ్మవారి తెప్పోత్సవాల్లో గురువారం అమ్మవారు తెప్పపై విహరించి భక్తులకు అభయమిచ్చారు. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి, సహస్రనామార్చన, నిత్యార్చన నిర్వహించారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పద్మ పుష్కరిణి వద్ద గల నీరాడ మండపంలో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు తెప్పోత్సవం వైభవంగా జరిగింది. ఇందులో అమ్మవారు ఐదు చుట్లు తిరిగి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం సిరుల తల్లి గజవాహనంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. ఈ తెప్పోత్సవాల్లో ఆలయ డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, సూపరింటెండెంట్ మధు, ఆలయ అర్చకులు బాబు స్వామి, టెంపుల్ ఇన్స్పెక్టర్లు సుభాష్, గణేష్, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: బడి ఈడు పిల్లలందరూ బడికి వెళ్లాలని శ్రీకాళహస్తి మండల విద్యాశాఖాధికారులు భువనేశ్వరి, అంబటి బాలయ్య పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి పురపాలక సంఘం పరిధిలోని భరద్వాజ గిరిజన కాలనీలో గురువారం 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా బడి బయటి పిల్లలను బడిలో చేర్చే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు భువనేశ్వరి, అంబటి బాలయ్య మాట్లాడుతూ... స్థానిక ప్రాథమిక పాఠశాల్లో ఐదో తరగతి పూర్తిచేసిన పిల్లలందరూ విధిగా ఆరోతరగతి చేరేలా తల్లిదండ్రులు సహకరించాలన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు అందుతున్న వసతులను వివరించారు. పాఠశాలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఉంటే హాస్టల్ వసతి కలిగిన పాఠశాల్లో చేర్చేందుకు చర్యలు తీసుకుంటామని తల్లిదండ్రులకు వివరించారు. బడి ఈడు పిల్లలందరినీ తప్పక బడికి పంపేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి, సీఆర్పీలు మునిమోహన్, శాంతి, లలిత, ప్రసాద్, గాంధీ, స్వప్న, హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోండి

- డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్

ప్రజాశక్తి - తిరుపతిడెస్క్: గ్రామీణ ప్రాంత కూలీలు ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ శ్రీనివాస్ ప్రసాద్ అన్నారు. గురువారం ఆయన ఏర్పేడు మండలంలోని అముడూరు పంచాయతీలో పర్కులేషన్ పాండ్ పూడిక తీత పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడుతూ 10మంది కూలీలు ఒక గ్రూపుగా ఏర్పడి ముగ్గురు కూలీలకు గడ్డపార పని, మరో ముగ్గురు పారతో బుట్ట గిన్నెలకు మట్టి పోస్తూ నలుగురు బుట్ట గిన్నెలో మట్టిన మోస్తూ రోజువారి కొలతల ప్రకారం పనిచేసి రూ.300 రోజువారి వేతనం పొందుతూ, వారానికి రూ.1800 100 రోజులకి రూ.30వేల పొందొచ్చు అన్నారు. ఒక ఆర్థిక సంవత్సరంలో వేతనంలు పొంది కుటుంబ ఆర్థిక స్థితి గతులు మెరుగుపరుచుకోవాలని తెలిపారు. అదేవిధంగా రైతులు బోర్లు, బావులలో నీరు పుష్కలంగా ఉండుటకు రైతుల పొలాలలో ఫారం పాండ్లు తవ్వి వర్షపు నీటిని ఒడిసపట్టి భూగర్భ జలాలను పెంపొందించాలని పిలుపునిచ్చారు. అనంతరం సిబ్బందితో సమావేశమై కూలీల సంఖ్య పెంచాలన్నారు. పనులు పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని ఈ సందర్భంగా తెలిపారు.

విద్యా సామగ్రి వితరణ



విద్యా సామగ్రి అందజేస్తున్న విజయ్‌కుమార్

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: తన మాతృమూర్తి పోతుగుంట సరస్వతమ్మ జ్ఞాపకార్థం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు గురువారం తన సొంత గ్రామం చిన్నరాజుకుప్పం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. పెన్సిళ్ళు, పెన్నులు, పలకలు పంపిణీ చేశారు. అలాగే పాఠశాలకు ఒక బీరువా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రకటించినట్టుగా తన సొంత గ్రామాభివృద్ధికి కట్టుబడి వున్నానని అందులో భాగంగా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోని పేద విద్యార్థులకు సహాయం చేయడం సంతోషంగా వుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రవినాయుడు, ఎంపీటీసీ శ్రీజ బాలాజీ నాయుడు, ధనపాల్, విజయ్‌చౌదరి, రమేష్ నాయుడు, అజయ్ చౌదరి, చంద్ర యాదవ్, మేఘనాథ్, మణి ఆదికేశవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నా తండ్రి ఆశీస్సులతో గెలిచా: భాను

గాలి భానుకు ఘన స్వాగతం పలుకుతున్న అభిమానులు

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: 'నా తండ్రి ఆశీస్సులతో నగరి ఎమ్మెల్యేగా గెలిచాను' అని ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ అన్నారు. గురువారం పుత్తూరు, నగరి పట్టణాల్లో ఆయన పర్యటించారు. గురువారం ఆయన జన్మదినం కావడంతో అభిమానులు ఆయనకు ఘన స్వాగతం కలికారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యేని ఘనంగా సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాను మాట్లాడుతూ అభివృద్ధి చేస్తాననే విశ్వాసంతో ప్రజలు ఓట్లేసి గెలిపించారని, వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా అభివృద్ధి పెద్దపీట వేస్తానన్నారు.

తప్పతాగి వాహనాలు నడిపితే చర్యలు

- గూడూరు సీఐ పాపారావు

ప్రజాశక్తి-గూడూరు టౌన్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని గూడూరు 1వ పట్టణ సీఐ పాపారావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన, మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై కఠిన చర్యలు చేపడతామన్నారు. అనంతరం పట్టణంలోని నారాయణ ఇంజనీరింగ్ కాలేజీలో, రైల్వే పార్సెల్ ఆఫీసు, రైల్వే స్టేషన్ బొగ్గుల దిబ్బ, పిఎస్ఆర్ పార్కు, సాధుపేట పరిసర ప్రాంతాలలో స్థానికుల సహాయంతో పరిసరాలను శుభ్రం చేయించారు.

మొక్కులు తీర్చుకున్న టిడిపి మహిళ నేత

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): చంద్రబాబు నాలుగోసారి ముఖ్యమంత్రిగా అవ్వాలని, నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి భారీ విజయం సాధించాలని మొక్కుకున్న కలికిరి మండలం గుట్టపాళెం యల్లంపల్లెకు చెందిన టిడిపి మహిళా కార్యకర్త గౌరి తిరుమలకు మెట్లమార్గంలో మోకాళ్ళపై వెళ్లారు. గురువారం అలిపిరి పాదాల మండపం వద్ద టిడిపి నాయకులు జనార్ధన్ గౌడ్, మల్లికార్జున గౌడ్, నిజముద్దీన్, కెవి రెడ్డి, మధురెడ్డి, జ్ఞానమూర్తి, చిట్టి, విజయకుమార్‌రెడ్డి ఆమె దీక్షను అభినందించి తిరుమలకు పంపారు.

ఇల్లులు కూల్చడం దారుణం

- సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కే.హరినాథ్

ప్రజాశక్తి-రేణిగుంట: పట్టణం లోని వివేకానంద కాలనీ వద్ద ఇటీవల ఇల్లు లేని నిరుపేదలు జగనన్న ప్రభుత్వంలో పట్టాలిచ్చి స్థలాలు చూపి లేదని ఉన్న ప్రభుత్వ స్థలంలో అప్పులు చేసి రూములు నిర్మించుకుంటే దానిని గురువారం రెవెన్యూ సిబ్బంది, పోలీసులతో టీడీపీ ప్రభుత్వ ఆదేశానుసారం కూల్చివేయడం దారుణమని సీపీఎం మండల కార్యదర్శి కే.హరినాథ్ అన్నారు. పేదలు సుమారు రూ.50వేలతో నిర్మించుకున్న ఇండ్లను వచ్చి కూల్చి వేయడం తగదని మండిపడ్డారు. గురువారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదలకు ప్రభుత్వ స్థలాల్లో ఇల్లు కట్టుకుంటే దానిని కూల్చివేయడం ఎంతవరకు న్యాయమని అసహనం అన్నారు. ఇల్లులు పగలకొట్టిన వాటికి నష్టపరిహారం కట్టించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు సెల్వరాజ్, మాజీ వార్డ్ మెంబర్ సత్య శ్రీ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యకర్తల ర్యాలీ

ప్రజాశక్తి-తిరుపతిడెస్క్: పిల్లలను అంగనవాడి కేంద్రాలలో చేర్పించి చదువుతోపాటు పోషకాహారాన్ని చిన్నారులకు అందించాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ భారతి కోరారు. మండలంలోని కొత్త వీరాపురం, కోబాక, మోదుల పాలెం, కుమ్మర మిట్ట మొదలగు గ్రామాలలో గురువారం అంగనవాడి బాట కార్యక్రమం జరిగింది. అంగనవాడి కేంద్రాలలో పౌష్టికాహారంతో పాటు నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు వివరించారు. అలాగే గ్రామాలలో బాల్య వివాహాల నిర్మూలనకు సంబంధించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు వై.సుబ్రహ్మణ్యం, అంగన్వాడి కార్యకర్తలు వైష్ణవి, భారతి, శారద, నాగభూషణమ్మ, మహిళా పోలీస్ ధరణి పాల్గొన్నారు.

ఈవీఎంలను మార్చి బిజెపి అధికారంలోకి వచ్చింది: చింతామోహన్

మీడియాతో మాట్లాడుతున్న చింతామోహన్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఈవీఎంలను ట్యాంపరింగ్ చేస్తూ కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వస్తుందని మాజీ ఎంపీ చింతామోహన్ ఆరోపించారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. గతంలో కూడా అధికారంలోకి రావడానికి బిజెపి ఈవీఎం యంత్రాలను రిమోట్తో తమకు అనుకూలంగా ఓటింగ్ సరలని మార్చుకుందని తీవ్ర విమర్శలు చేశారు. జూలై 1 తరువాత కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఐపిసి సెక్షన్లను మార్చడానికి నల్ల చట్టాలను తీసుకువస్తోందని, ఇది దేశ పౌరులకు ఎంత మాత్రం మంచిది కాదన్నారు. భారత రాజ్యాంగం ఎంతో విశిష్టమైందని, ఇతర దేశాల్లో కూడా ఇలాంటి రాజ్యాంగం లేదన్నారు. నేడు భారతీయులు క్షేమంగా ఉన్నారంటే అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే కారణమన్నారు. కాంగ్రెస్ పార్టీ హాయంలో దేశ సుభిక్షతకు శ్రమించిందని, బిజెపి ప్రభుత్వం దీనికి భిన్నంగా వ్యవహరిస్తోందన్నారు. వైద్య, విద్య ప్రవేశాలకు కేంద్ర ప్రభుత్వం నిర్వహించే నీట్ పేపర్ లీక్ దారుణం అన్నారు. ఎంతో బాధ్యతగా, పగడ్బందీగా నిర్వహించాల్సిన ఇలాంటి క్లిష్టమైన పరీక్షలను కూడా ఉదాసీనంగా వ్యవహరించడం విద్యార్థులకు నష్టం కలిగించే అంశం అన్నారు. నీట్ పేపర్ లీక్‌పై దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలను చేస్తున్నామన్నారు. అనంతరం పత్రిక రంగానికి నూతన శోభను తీసుకువచ్చి లక్షల మందికి పత్రికా రంగంలో ఉపాధి దొరుకుతుందన్న నమ్మకాన్ని కలిగించిన ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు చిత్రపటానికి చింతామోహన్ నివాళులర్పించారు. తిరుపతిలో రామోజీరావు విగ్రహం ఏర్పాటుకు వ్యక్తిగతంగా కృషి చేస్తానని, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్థలం కేటాయిస్తే విగ్రహ ప్రతిష్ట చేస్తానన్నారు. రామోజీరావు మెమోరియల్ లెక్చర్ ఏర్పాటు చేస్తూ పత్రికా రంగంలో విశేష సేవలు అందించిన తొమ్మిది మంది ప్రముఖ జర్నలిస్టులకు రామోజీరావు పేరుపై ఉత్తమ జర్నలిస్టు అవార్డులను ప్రదానం చేస్తామన్నారు. ఇందుకోసం ఓ కమిటీని ఏర్పాటు చేసి ఆ కమిటీ ఎంపిక చేసిన పాత్రికేయులకు అవార్డుల ప్రదానం జరుగుతుందన్నారు.

నిషేధిత మత్తు పదార్థాల విక్రయాలపై ఉక్కుపాదం

- ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశం

దొరవారిసత్రం పోలీస్‌స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

ప్రజాశక్తి-దొరవారిసత్రం, నాయుడుపేట, బుచ్చినాయుడుకండ్రిగ: నిషేధిత మత్తు పదార్థాల విక్రయదారులపై ఉక్కు పాదం మోపాలని తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్ రాజు పోలీస్ అధికారులకు ఆదేశించారు. ఆయన నాయుడుపేట పోలీస్ డివిజన్ పరిధిలోని దొరవారిసత్రం, నాయుడుపేట, ఆ తరువాత బుచ్చినాయుడుకండ్రిగ పోలీస్ స్టేషన్లను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరిసరాలను పరిశీలించి పట్టుబడిన వాహనాల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మసులుకోవాలన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పబ్లిక్ న్యూసెన్స్ తగ్గించడానికి విజిబుల్ పోలీస్ వ్యవస్థ పని చేయాలని ఆదేశించారు. విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది సమస్యలు ఆయా స్టేషన్ల పరిధిలో పరిష్కరించలేని పక్షంలో తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. సమస్యాత్మక గ్రామాలు, ప్రాంతాలలో పోలీస్ పికెట్లు మరికొన్ని రోజులు కొనసాగించాలని ఆదేశించారు. రాష్ట్రంలోకి రవాణా అవుతున్న మత్తు నిషేధిత పదార్థాలు, గంజాయి గుట్కా, హాన్స్ వంటి వాటి పూర్తిస్థాయి నిర్మూలనకు ఉక్కు పాదం మోపాలని పోలీస్ అధికారులకు సూచించారు. అవి రవాణా అవుతున్న ప్రాంతాలు, వాటితో వ్యాపారం చేస్తున్న వ్యక్తులను గుర్తించి కేసులు నమోదు చేయాలని తెలిపారు. ఆంధ్ర సరిహద్దు తడ చెక్ పోస్టును పరిశీలించి విధుల్లో ఉన్న సిబ్బందిని అప్రమత్తం చేశారు. సిబ్బందికి అవసరమైన సదుపాయాలు కొరత ఉంటే వెంటనే వాటి ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని తడ ఎస్ఐకి ఆదేశించారు. ఆయన వెంట నాయుడుపేట డిఎస్పిలు వెంకటాద్రి, సీఐ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

మహేష్ మొబైల్స్‌లో నూతన మొబైల్ లాంచ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మార్కెట్లోకి నూతన ఉత్పాదనలను తీసుకొస్తున్న ఒప్పో సంస్థ ఎఫ్ 27 ప్రో ప్లస్ మొబైల్‌ను తీసుకొచ్చింది. గురువారం తిరుపతిలో మొట్టమొదటిగా నగర పరిధిలోని తిలక్ రోడ్డులో గల మహేష్ మొబైల్స్‌లో ఈ నూతన ఉత్పాదన ఒప్పో ఎఫ్ 27 ప్రో ప్లస్ ప్రారంభించారు. ఈ నూతన మొబైల్ ఫోన్‌ను టిడిపి యువ నాయకులు ఆర్ఆర్ రమణ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై మార్కెట్లోకి విడుదల చేశారు. కొత్త ఫీచర్లు కలిగిన ఈ ఒప్పో ఎఫ్ 27 ప్రో ప్లస్‌ను మార్కెట్‌లోకి విడుదలైన వెంటనే 50మంది కస్టమర్లు ఈ ఫోను కొనుగోలు చేశారు. ఒప్పో సంస్థ ప్రతినిధులు ఈ మొబైల్ ఫోన్ ఫీచర్లను కస్టమర్లకు వివరించారు.

సమాజానికి ప్రసాదరావు సేవలు అవసరం

ఎంపి సామాజిక స్ఫూర్తిని కొనియాడిన ఐటిజీవోఏ సభ్యులు

ఎంపిని సన్మానిస్తున్న ఇన్కమ్ టాక్స్ గెజిటెడ్ అసోసియేషన్ సభ్యులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు పార్లమెంటు సభ్యునిగా భారీ మెజారిటీతో గెలుపొందిన దగ్గుమళ్ళ ప్రసాదరావు సేవలు సమాజానికి అవసరమని ఇన్కమ్ టాక్స్ గెజిటెడ్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. కర్ణాటక, గోవా యూనిట్ ఆధ్వర్యంలో గురువారం గోవాలో ఇన్కమ్ టాక్స్ గెజిటెడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఓసమావేశానికి చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ను కర్ణాటక, గోవా యూనిట్కి సంబంధించిన ఇన్కమ్ టాక్స్ గెజిటెడ్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఐఆర్ఎస్ ఆఫీసర్గా దేశానికి దగ్గు మళ్ళ ప్రసాదరావు అందించిన సేవలను సామాజిక స్ఫూర్తిని కొనియాడారు. సమర్థవంతమైన ఆఫీసర్గా ప్రసాద్ రావుకి పేరు ప్రఖ్యాతులు ఉన్నాయని, ఈ నేపథ్యంలో చిత్తూరు పార్లమెంట్ ప్రజలు ఆయన్ను భారీ మెజారిటీతో గెలిపించి, చిత్తూరు ఉమ్మడి జిల్లాలకు సేవలందించే అవకాశం కల్పించడం అభినందనీయం అన్నారు.

అన్న క్యాంటీన్ పునఃప్రారంభం

ప్రజాశక్తి- పుంగనూరు : పుంగనూరు మున్సిపల్ కేంద్రంలో ఉన్న అన్న క్యాంటీన్ను పునః ప్రారంభించనున్నట్లు డీఈ మహేష్ తెలిపారు. స్థానిక పంచాయతీరాజ్ అతిథిగృహ ఆవరణంలో ఉన్న అన్న క్యాంటీన్ భవనాన్ని తెలుగుదేశం పార్టీ నేతలతో కలిసి గురువారం పరిశీలించారు. ఈభవనంలో ఉన్న ఎంవిఐ కార్యాలయాన్ని మరొక చోటికి మార్చుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. ఆ భవనంలోని అన్న క్యాంటీన్ త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ కృష్ణకుమార్, టిడిపి నేతలు సీవీ రెడ్డి, విశ్రాంత డీఎస్పీ సుకుమార్ బాబు, టిడిపి రూరల్ అధ్యక్షులు గంగసాని మాధవరెడ్డి, దేశాధి శ్రీనివాసులు, లక్ష్మణరాజు, మాజీ ఎంపిటీసీ వెంకటస్వామి పాల్గొన్నారు.

శ్వేతపత్రం విడుదలపై హర్షం

ప్రజాశక్తి- పుంగనూరు: ంగత వైసిపి పాలనపై శ్వేతపత్రం విడుదల చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయం హర్షించదగ్గదని జిల్లా ప్రియాంక సేవదళ్ అధ్యక్షుడు ఎస్.సజ్జద్బాషా అన్నారు. పాలనపై పట్టు ఉన్న చంద్రబాబు నాయుడు శ్వేతపత్రం విడుదల చేస్తామంటూ ప్రకటన ఇవ్వడం మంచి నిర్ణయం అన్నారు. పోలవరం గత వైసిపి ప్రభుత్వం పాలనలో జరిగిన అన్ని కార్యక్రమాలపై శ్వేతపత్రాన్ని విడుదల చేయలన్నారు. గత పాలనలో రాష్ట్రంలో వ్యవస్థలపై జరిగిన విధ్వంసం ఆంధ్రప్రదేశ్లోని ఐదు కోట్ల మంది ప్రజలు తెలుసుకోవాలని అన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో

జనరల్ ఫండ్ రూ.1.36 కోట్లు స్వాహా

- ఔట్సోర్సింగ్ కంప్యూటర్ ఉద్యోగి చేతివాటం
- అధికారులు హస్తం ఉందా.?
- పలు అనుమానాలు..?

ప్రజాశక్తి- పుంగనూరు

ఎంపీడీవో కార్యాలయంలో జనరల్ ఫండ్ నిధులు రూ. 1.36 కోట్లు స్వాహా అయినట్లు, ఈ నిధులు ఔట్సోర్సింగ్ ఉద్యోగి కంప్యూటర్ ఆపరేటర్ సునీల్ స్వాహా చేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయమై జూన్ 10న ఏవో రాజేశ్వరి జడ్పీ సీఈవో గ్లోరియాకు ఫిర్యాదు చేసింది. 2022-23, 24 రెండు సంవత్సరాల లోపు జనరల్ ఫండ్ నిధులు రూ. 1,36,61,668లు స్వాహా చేసినట్లు తెలిసింది. ఎంపీడీవో కార్యాలయ జనరల్ ఫండ్ నుండి నగదు ఉపసంహరించు కోవాలంటే సంబంధిత అధికారులు వేలిముద్ర వేయల్సి ఉంటుంది. అంతేకాకుండా నగదు ఉపసంహరణ, చెక్కులు ఇవ్వటం, ఎలాంటి లావాదేవీలు జరిగిన లెడ్జర్ బుక్కులో ఎంట్రీ చేయాల్సి ఉంటుంది. దీనిపై ఎంపీడీవో కూడా క్రాస్చెక్ చేసుకుని కౌంటర్ సంతకం పెడుతుంటారు. ఇన్ని రకాలుగా అధికారులు చెక్ చేసిన తర్వాతే బ్యాంకు నుండి నగదు ఉపసంహరణ చేసుకోవచ్చు. ఔట్సోర్సింగ్ కంప్యూటర్ ఉద్యోగి సునీల్ నగదు విత్డ్రా సమయంలో సర్వర్లు పనిచేయడం లేదంటూ అతని సెల్ఫోన్ ద్వారా వేలిముద్ర వేయించి ఖాతాలోకి బదిలీ చేసుకొని ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కంప్యూటర్ ఉద్యోగి సునీల్, మరో బినామీ వ్యక్తి అయినా మజ్జిగ ముని రామయ్య ఖాతాలకు నగదు జమ అయినట్లు తెలుస్తుంది. రెండేళ్లపాటు ఇలాంటి అవకతవకులు జరుగుతుంటే అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. ఆలస్యంగా తెలుసుకున్న అధికారులు అతనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమే అప్పట్లో ఉన్న ఎంపీడీవోలు వివరణ తీసుకుని వెంటనే పంపాలని జడ్పీ సీఈఓ ప్రస్తుత ఎంపీడీవో మునిరెడ్డికి ఆదేశాలు ఇచ్చారు.

ఇద్దరు ఎంపీడీఓలకు మెమోలు

జనరల్ పండ్ నిధులు స్వాహా విషయమై 2022-23, 24 ఏడాదిలలో పనిచేసిన ఇన్చార్జ్ ఎంపీడీవోలు రాజేశ్వరి, నారాయణలకు మెమోలు జారీ చేసినట్లు ఎంపీడీవో మునిరెడ్డి విలేకరులకు తెలిపారు. మూడు రోజుల్లోపు నిధులు విషయమై సమగ్ర వివరణ ఇవ్వాలని కోరినట్లు చెప్పారు.

బడిలోనే పిల్లలకు భద్రత: డీఈవో

సమావేశంలో ప్రసంగిస్తున్న డీఈవో దేవరాజులు

ప్రజాశక్తి- కార్వేటినగరం: బడిలో వేసే అడుగు విద్యార్థుల భవితకు వెలుగవుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి సి.దేవరాజులు అన్నారు. గురువారం ఎంఈఓ కార్యాలయంలో జరిగిన విద్యా సదస్సులో డీఈఓ దేవరాజులు మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను బడిలో చేరిపించేందుకు ఈనెల 13 నుండి జులై 12వ తేదీ వరకు ప్రభుత్వం నేను బడికి పోతా అనే కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టుతుందన్నారు. 6 నుంచి 14 సంవత్సరాల పిల్లలందరూ బడులనే ఉండాలని, బడి మానేసిన పిల్లలను తిరిగి బడులల్లో చేర్పించాలన్నదే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు. అందుకు ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీలు సీఆర్పీలు కలిసి బడి ఈడు పిల్లలను గుర్తించి బడులలో చరిపించాలని తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించాలని వారితో విద్యార్థులది బంగారు భవిష్యత్ అన్నారు. ఎంఈఓ విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ బడులల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించడం జరిగిందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి 100శాతం పిల్లలు పాఠశాలలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎంఈఓ 2 మనోజ్ కుమార్ మాట్లాడుతూ పనులలో పెట్టుకోవడం నేరమని వారందరు బడులలోని ఉండాలన్నారు. అనంతరం డీఈఓ దేవరాజులను ఎంఈఓలు, ఉపాధ్యాయులు శాలువాలు కప్పి సన్మానించారు. సీఆర్పీలు, ఉన్నత పాఠశాల హెచంలు,యూపీ పాఠశాలలో హెచం పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను పరిరక్షించుకుందాం: యుటిఎఫ్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రభుత్వ బడులను రక్షించుకుందాం పాఠశాలలో విద్యార్థులను చేర్పిద్దాం అనే కరపత్రాన్ని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజు ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించడం జరిగింది. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ప్రతి ఉపాధ్యాయుడు శక్తివంచన లేకుండా కృషి చేయగలరని సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవి రమణ, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.సోమశేఖర్ నాయుడు, ఎన్.మనిగండన్, నాయకులు ఎస్.రహనబేగం, కె.రెడ్డప్ప నాయుడు, ఎస్పి. బాషా, కె.సరిత, ఎం.పార్థసారథి, చిరంజీవి, రాజేష్ కుమార్, మాధవ రెడ్డి, రమేష్ తదిరులు పాల్గొన్నారు.

'బలవంతంగా రాజీనామా చేయించారు '

ప్రజాశక్తి- పుంగనూరు: సచివాలయంలో పనిచేస్తున్న వాలంటీర్లను వైఎస్ఆర్సిపి నాయకులు, కౌన్సిలర్లు ఎన్నికలకు ముందు బలవంతంగా రాజీనామా చేయించారని ఆరోపించారు. మున్సిపాలిటీ పరిధిలో పనిచేసే సచివాలయం వాలంటీర్లు గురువారం కమీషనర్ నరసింహ ప్రసాద్కు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలప్పుడు వైసిపి నాయకులు, ఆయా వార్డు కౌన్సిలర్లు, వాలంటీర్లు పదవులకు రాజీనామా చేయాలని బలవంతం చేసి రాజీనామా చేయించారని ఆరోపించారు. తమను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి- పూతలపట్టు: ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను గత మూడు రోజులుగా మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పంపిణీ చేస్తున్నారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాల పంపిణీకి అధికారులు శ్రీకారం చుడుతున్నారు.

ఘనంగా రెవెన్యూ దినోత్సవం..!

రామకుప్పంలో..

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రెవెన్యూ దినోత్సవంను పురస్కరించుకొని గురువారం కలెక్టరేట్లోని గ్రీవెన్స్ హాల్లో రెవెన్యూ అసోసియేషన్ కలెక్టరేట్ యూనిట్ తరపున రెవెన్యూ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పుల్లయ్య, కలెక్టరేట్ ఏఓ వెంకటేశ్వర్లు, రెవెన్యూ అసోసియేషన్ కలెక్టరేట్ యూనిట్ ప్రెసిడెంట్ పార్థసారథి సెక్రటరీ హేమాద్రిరాజు, ట్రెజరర్ మధుసూదన్, సిబ్బంది పాల్గొన్నారు.

రామకుప్పం: మండల తహశీల్దారు కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవాన్ని అధికారులు ఘనంగా నిర్వహించారు. గురువారం కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికారులు, విలేజ్ సర్వేర్లు, గ్రామ రెవెన్యూ సహాయకులు, రిటైర్డ్ రెవెన్యూ అధికారులకు పూలమాలలు వేసి శాలువాలు కప్పి సన్మానించారు. సుదీర్ఘ కాలం ప్రజలకు, ప్రభుత్వానికి వారు అందించిన సేవలను కొనియాడారు. తహశీల్దార్ శ్రీధర్, సురేష్, హరినాథ్ రెడ్డి, మహేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

పెద్దపంజాణి: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని తహశీల్దార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది తహసీల్దార్ను, డిప్యూటీ తహశీల్దార్ ఫణి కుమార్ను సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రజల రెవిన్యూ సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. గ్రామ రెవెన్యూ అధికారి సుబ్రహ్మణ్యం, విఆర్ఓ సంగం వీఆర్వోల సంఘం అధ్యక్షులు వెంకటేష్ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న కాలనీ గుట్ట కబ్జా

ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తే కఠిన చర్యలు: తహశీల్దార్

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: మండలంలోని ముద్దికుప్పం గ్రామపంచాయతీ చొక్కామడుగు జగనన్న కాలనీలో గుట్ట కబ్జాకు గురైంది. గుట్టను అదే గ్రామానికి చెందిన ఓ వైసిపి నాయకుడు కబ్జా చేసి పెద్ద నిర్మాణానికి ప్రయత్నించగా విషయం తెలుసుకున్న మండల తహశీల్దార్ ఆల్ఫ్రెడ్ సంఘటన స్థలానికి చేరుకొని కబ్జాకు గురైన ప్రాంతాన్ని పరిశీలించారు. ఇది ప్రభుత్వ స్థలంలో ఎవరు ప్రవేశించడానికి వీల్లేదని, ఎవరైనా ప్రభుత్వ స్థలంలో ఆక్రమించుకోవాలన్నా అనుమతి లేకుండా వేరే ఏదైనా చేయాలన్నా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇదిలా ఉండగా గతంలో చొక్కామడుగు జగనన్న కాలనీలో గతంలో ఓ బడా నాయకుడు జగనన్న కాలనీలో ఇల్లు కావాలంటే 'లక్ష కొట్టు ఇంటి పట్టా పట్టు' అన్న చందాగా జగనన్న కాలనీ ఇళ్లను అమ్ముకున్నాడు.. జగనన్న కాలనీలో కొంతమందికి ఇంటి పట్టా మంజూరైనా వారికి ఇంటి స్థలం లేదంటూ వారిపై దౌర్జన్యం చేశాడు.. ఆ బడా నాయకుడు చెప్పిందే వేదంగా రెవెన్యూ అధికారులు, పంచాయతీ అధికారులు వత్తాసు, పలికి అనేక అక్రమాలకు పాల్పడ్డారని స్థానికులు ఆరోపించారు. ఈ అక్రమాలపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని గ్రామస్తులు తెలిపారు. అనంతరం గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ సోదరుడు నిధి కబ్జా గురైన స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రభాకర్, టిడిపి నియోజకవర్గ ఎస్సీసెల్ కార్యనిర్వహణ కార్యదర్శి కుమార్ పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి

విద్యా ప్రమాణాల పెంపు
యూనివర్శిటీ ఏర్పాటు : ఎంపి దగ్గుమళ్ళ ప్రసాద్‌రావు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఉన్నత విద్యావంతుడు, స్నేహశీలి దగ్గుమళ్ళ ప్రసాద్‌రావు చిత్తూరు పార్లమెంట్ సభ్యులుగా 2,50,000 ఓట్ల మెజార్టీతో ఘనవిజయం సాధించారు. ఎన్నికల ముందు నుంచి చిత్తూరు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించడంతో పాటు జిల్లాపై సమగ్ర అవగాహన ఉండటంతో ఎక్కడికక్కడ స్థానిక సమస్యలపై కేంద్ర బిజెపి, రాష్ట్ర తెలుగుదేశం అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో సమస్యల పరిష్కారానికి ఆచరణకు తగ్గ హామీలను ఇచ్చారు.

చిత్తూరు జిల్లాకు చెందిన వ్యక్తి కాకపోయినా బాపట్ల వాసి అంటూ వైసిపి ప్రచారం చేసినా జిల్లా ప్రజలు దగ్గుమళ్ళ ప్రసాద్‌రావును అక్కున చేర్చుకొని భారీ మెజార్టీ అందించారు. ఆయనకున్న దూరదృష్టి అభివృద్ధిపై స్పష్టతే ఇందుకు కారణం. ఎన్నికల్లో తాను విజయం సాధిస్తే జిల్లాను అభివృద్ధిలో తీసుకుపోయేందుకు జిల్లా ప్రత్యేక మ్యానిఫెస్టోను ప్రకటించి తన ప్రత్యేకత చాటుకున్నారు. ఇటీవల మామిడి రైతులకు మద్దతు ధర కల్పించాలంటూ జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేస్తూ లేఖ రాసి జిల్లాలోని మామిడి రైతులకు అండగా నిలిచారు. చిత్తూరు రైల్వేస్టేషన్ అభివృద్ధికి కృషి చేస్తూ చిత్తూరు రైల్వేస్టేషన్ మీదుగా వెళ్లే ప్రతి ఎక్స్‌ప్రెస్ రైళ్ల ఆగే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఏనుగుల దాడుల నివారణ కోసం బంగారుపాళ్యం నుండి కుప్పం వరకు సోలార్ ఫెన్సింగ్‌తో పాటు అటవీ ప్రాంతంలో కందలు నిర్మాణం, అంతర్జాతీయ సంస్థల ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు, చిత్తూరు పార్లమెంట్ పరిధిలో వనుకబడిన వర్గాలకు కమ్యూనిటీ భవనాల నిర్మాణం, జిల్లా కేంద్రమైన చిత్తూరులో యూనివర్శిటీ ఏర్పాటు, మామిడి రైతుల మద్దతు ధర కోసం మ్యాంగో బోర్డు ఏర్పాటు, చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ట్రామా కేర్ యూనిట్ ఏర్పాటు, నగరంలో చేనేత కార్మికుల కోసం టెక్స్‌టైల్స్ పార్కు, పలమనేరులో సిల్క్‌ఫామ్ ఆధునీకరణ చర్యలు, కాణిపాకంలో వేద పాఠశాల ఏర్పాటు, జీడినెల్లూరులో లెదర్ ఫార్క్, ఫైర్ స్టేషన్ నిర్మాణం, పలమనేరు, కుప్పం ప్రాంతాల్లో కోల్డ్ స్టోరేజీలు, సిఎంసీ ఆసుపత్రిలో రోగుల కోసం హెల్ప్‌లైన్, యువతీ, యువకుల ఉపాధి కోసం ప్రత్యేక పారిశ్రామిక వాడలు, మహిళా స్వయం ఉపాధి కోసం ఆర్థిక భరోసా, వ్యవసాయ రైతుల కోసం డ్రిప్ ఇరిగేషన్‌కు పూర్వవైభవం, నిరుద్యోగ యువతీ యువకులకు స్కిల్ డెవలప్మెంట్, స్టడీ సర్కిల్స్ ఏర్పాటు, చిత్తూరులో ఆటో మొబైల్ పార్కు, చిత్తూరు నగర ప్రజల తాగునీటి సమస్య పరిష్కారం కోసం అడవిపల్లి రిజర్వాయర్ పూర్తి, కాట్పాడి నుండి తిరుపతి వరకు డబుల్ రైల్వేలైన్, జిల్లాలో నీటి నిల్వల పెంపు కోసం చెరువుల మరమత్తు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, జిల్లా కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, నగరాన్ని సర్వాంగ సుందరంగాతయారు చేసేలా స్మార్ట్‌సిటీ , క్రీడల కోసం స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఈడిగ, గౌడ, బిసి, ఎస్సి,ఎస్టీ, మైనారిటీల సంక్షేమానికి ప్రత్యేక కృషి చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాద్‌రావు జిల్లా అభివృద్ధిపై ఎంతో దీర్ఘ దృష్టితో జిల్లా సమగ్రాభివృద్ధి కోసం మ్యానిఫెస్టోలో ప్రకటించారు.

'బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి'

ప్రజాశక్తి- పెద్దపంజాణి: ఆరు సంవత్సరాలు పైబడిన బాలబాలికలు ప్రతి ఒక్కరూ పాఠశాలకు వెళ్లాలని మండల విద్యాధికారి గోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం తలపెట్టిన 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా జాతీయ రహదారిలో ర్యాలీ నిర్వహించారు. బడి ఈడు పిల్లలు పనిలో కాదు పాఠశాలలో చదువుకోవాలని నినాదాలు చేస్తూ అవగాహన కల్పించారు. గ్రామ, వార్డు వాలంటీర్ల సాయంతో పిల్లలను గుర్తించి వారిని పాఠశాలలో చేర్పించే విధంగా కిందిస్థాయి సిబ్బంది చొరవ తీసుకోవాలని మండల విద్యాధికారి సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేశవపిళ్లై, గ్రామ రెవెన్యూ అధికారి సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

'కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: అఖిల భారత విద్యార్థి సమాఖ్య చిత్తూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో స్థానిక గాంధీ విగ్రహం వద్ద నీట్, యూజీసీ నెట్ పరీక్ష పేపర్ లీకేజీలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన నీట్ పరీక్ష ఫలితాలలో దేశవ్యాప్తంగా 67మంది విద్యార్థులకు 720 మార్కులకు 720 రావడం అందులో ఆ ఆరుగురు విద్యార్థులు హర్యానాలోని ఒకే సెంటర్‌కి సంబంధించి రావడం వెనుక బీహార్‌కు చెందిన మురా ఒక్కొక్క విద్యార్థి దగ్గర నుంచి రూ.30లక్షలు వసూలు చేసి దొరికిన కూడా వారిని ఇంతవరకు అరెస్టు చేయకపోవడం దుర్మార్గమన్నారు. తక్షణమే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

బీసీల అభివృద్ధికి సహకరించండి

జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: జిల్లాలో బీసీల సంక్షేమం, అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను జిల్లా టిడిపి యాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్ కోరారు. తిరుమల వెంకటేశ్వర స్వామి దర్శనార్థం మంత్రి కొల్లు రవీంద్ర విచ్చేసిన సందర్భంగా తిరుమల గెస్ట్ హౌస్‌లో ఆయన్ని మర్యాద పూర్వకంగా కలిసి శ్రీధర్ యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు బీసీలకు తన మంత్రివర్గంలో చోటు కల్పించి బీసీ అభివృద్ధికి పెద్దపీట వేశారని హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రజా పాలన మొదలైందని ప్రజల సేవ కోసం నిరంతరం శ్రమిస్తూ ప్రజల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న చంద్రబాబు ప్రజల ఆశీస్సులతో మరింత ముందుకెళ్తారని ఆశా బావ వ్యక్తం చేశారు. అనంతరం మంత్రిని శాలువతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ టీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి బాబు నాయుడు, భాస్కర్ నాయుడులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి -ఎస్ఆర్ పురం: గంగాధర నెల్లూరు నియోజకవర్గ టిడిపి నాయకులు, జిల్లా యాదవ సహర సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్ గురువారం చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్ నాయుడుని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువతో సన్మానం చేశారు. నియోజకవర్గ టిడిపి నాయకులు సూర్యరెడ్డి, వరదరాజు యాదవ్, బుజ్జి పాల్గొన్నారు.

IN THE COURT OF THE FIRST ADDL. JUNIOR CIVIL JUDGE :: TIRUPATI
O.S.NO.858/2021
Between:
Canara Bank, I.S.Mahal Branch, Tirupati rep. by its Branch Manager ... Plaintiff
And
D.Sridevi W/o. D.Sathyananda Kumar Flat No.4, D.No.19-12-249, Dwarakamayi Apartment, Bairagipatteda, Tirupati, Tirupati Urban Mandal ... Defendant
SUIT SUMMONS TO DEFENDANT
Please take suit summons that the above suit filed by the Plaintiff for recovery of money and the matter is posted to 01-07-2024 for your appearance either in person or through your counsel at about 10.30 a.m. in the above court. In the event of your absence the matter will be decided exparte.
Hearing Date: 01.07.2024
N.N.Sunil Kumar,
Advocates:: Tirupati.

ప్రమాణ స్వీకారోత్సవ
శుభాకాంక్షలు
తిరుపతి నియోజకవర్గంలో
ఎన్నడూ లేని విధంగా
అత్యధిక మెజార్టీతో
శాసన సభ్యులుగా ఎన్నికై
నేడు అసెంబ్లీ వేదికగా
ప్రమాణ స్వీకారం చేయుచున్న
గా॥ శ్రీ ఆరని శ్రీనివాసులు
(JMC) గారికి
ఇవే మా హార్థిక శుభాకాంక్షలు
అన్నా సంధ్యా యాదవ్,
M.D., Radiology
49వ డివిజన్ కార్పొరేటర్
తిరుపతి నగరపాలక సంస్థ
అన్నా అనితా యాదవ్,
MS (USA)
48వ డివిజన్ కార్పొరేటర్
తిరుపతి నగరపాలక సంస్థ